Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 214 | మంగళవారం 27 జనవరి 2026 | పేజీలు : 10 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## రేపు ఈయూ శిఖరాగ్ర సమావేశం

**హైదరాబాద్ – సూర్య వాస్తవం :** సోమవారం ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విజయవంతమైన భారతదేశం ప్రపంచాన్ని మరింత స్థిరంగా, సంపన్నంగా, సురక్షితంగా మారుస్తుందని అన్నారు. రేపు భారత్‌లో ఈయూ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె నేడు రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తోపాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అతిథులుగా హాజరయ్యారు.

### ఫుట్‌బాల్ మైదానంలో నరమేధం...
# 11 మంది బలి



- మెక్సికో ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో గన్‌మెన్ల దాడి
- కాల్పుల్లో 11 మంది మృతి, 12 మందికి గాయాలు
- ఆర్గనైజ్డ్ క్రైమ్ ముఠాల పనేనన్న మేయర్
- దేశంలో డ్రగ్ కార్టెల్స్ హింసకు నిదర్శనంగా ఘటన

**మెక్సికో– సూర్య వాస్తవం**

మెక్సికోలో మరోసారి తుపాకులు గర్జించాయి. ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ ముగిసిన వెంటనే సాయుధులైన దుండగులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 12 మంది గాయపడ్డారు. దేశ మధ్య ప్రాంతంలోని గ్వానాజువాటో రాష్ట్రంలోని సలమాంకా నగరంలో ఆదివారం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక కమ్యూనిటీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మ్యాచ్ ముగిసిన తర్వాత కొందరు సాయుధులు మైదానంలోకి దూసుకొచ్చి, అక్కడున్న క్రీడాభిమానులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో 10 మంది అక్కడికక్కడే మరణించగా, మరొకరు

- మిగతా 2లో..

### మంచు తుపానులో విమాన ప్రమాదం...
# ఏడుగురి మృతి

- అమెరికాలో భారీ మంచు తుపాను
- టేకాఫ్ సమయంలో కూలిన ప్రైవేట్ జెట్, ఏడుగురి మృతి
- ఒకరు తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడిన వైనం
- ఘటనపై ఎఫ్ఏఏ, ఎన్‌టీఎస్‌బీ దర్యాప్తు ప్రారంభం
- ప్రమాదంతో బాంగర్ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేత

2లో



### శాంతికాముక దేశం
# ఇండియా

## - రిపబ్లిక్ డే ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ప్రస్తుతం ఘర్షణలు నిండిన ప్రపంచంలో భారతదేశం ఒక శాంతి దూతగా వ్యవహరిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. శాంతి సందేశాన్ని వ్యాప్తి చేస్తోందని, ఇది మానవాళి భవిష్యత్‌ను సురక్షితంగా ఉంచడానికి ఎంతో కీలకమని అన్నారు. ప్రపంచంలో శాంతి ఉంటేనే మానవాళి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని చెప్పారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ఆదివారం రాత్రి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ ప్రసంగంలో ఆపరేషన్ సింధూర్, మహిళా సాధికారత, వందేమాతరం, జీఎస్టీ , దేశ ఆర్థిక వ్యవస్థ.. వంటి అంశాలను ప్రస్తావించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా నిర్వహించామని, ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై ఖచ్చితమైన దాడులతో ఉగ్రవాద



కేంద్రాలు ధ్వంసం చేసామన్నారు. సియాచిన్ బేస్ క్యాంప్‌ను వ్యక్తిగతంగా సందర్శించిన విషయాన్ని, సుఖోయ్, రాఫెల్, జలాంతర్గామిల్లో ప్రయాణించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఎదిగే ప్రయాణానికి

- మిగతా 2లో..

### తొలిసారి అమరావతిలో...
# ఘనంగా గణతంత్ర వేడుకలు

- చారిత్రాత్మకమన్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్
-- సూపర్ సిక్స్‌తో సంక్షేమం.. సంపద సృష్టి లక్ష్యమని వెల్లడి
-- ఆకట్టుకున్న శకటాలు



**అమరావతి - సూర్య వాస్తవం**

సూపర్ సిక్స్ అమలుతో సంక్షేమం, సంపదను సృష్టించడంతో పాటు, అసమానతల తగ్గింపే ప్రభుత్వ లక్ష్యమని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. సమైక్య రాష్ట్ర విభజన తరువాత తొలిసారి రాజధాని అమరావతిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం జరిగాయి. ఈ వేడుకల్లో సిఎం చంద్రబాబునాయుడు దంపతులు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దంపతులు, ఐటి మంత్రి నారా లోకేష్‌తో పాటు పలువురు హైకోర్టు జడ్జిలు, మంత్రులు పాల్గొన్నారు. తొలిసారి అమరావతిలో గణతంత్ర వేడుకలు జరుగుతుండటంతో స్థానిక రైతుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో తొలిసారి అమరావతిలో జరుగుతున్న వేడుకలను చారిత్రాత్మకమైనవిగా అభివర్ణించారు. 'తొలిసారి అమరావతిలో

- మిగతా 2లో..



### వాయు కాలుష్యంతో
## ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి
### - కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### సాంకేతికతతో ఉద్యోగులపై
# పనిభారం తగ్గించండి

## - ఆర్‌టిజిఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి– సూర్య వాస్తవం**

పాలనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి క్షేత్రస్థాయి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సమర్థత లేకపోతే శిక్షణ ఇచ్చి నిరంతరం పర్యవేక్షించాలని, తద్వారా ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ఆర్‌టిజిఎస్‌పై ఉండవల్లిలోని తన నివాసంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. సాంకేతికతతో గవర్నెన్స్‌లో చాలా సమస్యలు పరిష్కరించవచ్చని, సాంకేతికతను ఉద్యోగులు, అధికారులు విస్తృత స్థాయిలో వినియోగించుకునేలా ప్రోత్స హించాలని కోరారు. 2026 సంవత్సరం టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్‌గా మారాలని తెలిపారు. ప్రభుత్వ సేవల్లోనూ ఎఐ పాత్ర పెరగాలని, దీనిని వినియోగించుకొని గ్రీవెన్సులు సత్వరంగా పరిష్కరించాలని నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై మరింత దృష్టి సారిస్తామని చెప్పారు. మనమిత్ర–వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 ప్రభుత్వ సేవలను అందించగలుగుతున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 1.43 కోట్ల మంది ఈ సేవలను వినియో



గించుకున్నారని వెల్లడించారు. వైద్య, వ్యవసాయ, రెవెన్యూ, రహదారులు, ఆర్‌టిఎ, అగ్నిమాపకశాఖల పనితీరుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సిసిఎల్ఎ చీఫ్ కమిషనర్ జి జయలక్ష్మి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్,

- మిగతా 2లో..



### హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా మారిన
## సీఎం రేవంత్ రెడ్డి

- 'లీడర్‌షిప్ ఇన్ 21వ శతాబ్దం' కోర్సులో చేరిక
- భారీ హిమపాతం, ప్రతికూల వాతావరణంలోనే తరగతులకు హాజరు
- సీఎం అమెరికా పర్యటనపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు
- ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకే ప్రాధాన్యతా అని ప్రశ్న

2లో

## ఫుట్‌బాల్ మైదానంలో నరమేధం...

# 11 మంది బలి

(మొదటిపేజీ తరువాయి)

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గాయపడిన వారిలో ఒక మహిళ, ఒక బాలుడు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ హింసాత్మక ఘటనపై సలమాంకా మేయర్ సీజర్ ప్రియెటో తీవ్రంగా స్పందించారు. ఇది ఆర్గనైజ్డ్ క్రైమ్ ముఠాల పనేనని ఆయన ఆరోపించారు. "మా ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలి. నేర ముఠాలు అధికారులను లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి," అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందినప్పటికీ, గ్వానాజువాటో రాష్ట్రం దేశంలోనే అత్యధిక హత్యలు జరిగే ప్రాంతంగా మారింది. ఇక్కడ ఆయిల్ దొంగిలించే సాంటా రోసా డి లిమా గ్యాంగ్, జలిస్కో న్యూ జెనరేషన్ డ్రగ్ కార్టెల్ మధ్య ఆధిపత్య పోరు తీవ్ర స్థాయిలో ఉంది. ఈ ఘటన మెక్సికోలో కొనసాగుతున్న డ్రగ్ ముఠాల హింసకు మరోసారి అద్దం పట్టింది. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## మంచు తుపానులో విమాన ప్రమాదం...

# ఏడుగురి మృతి

- అమెరికాలో భారీ మంచు తుపాను
- ఒకరు తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడిన వైనం
- ఘటనపై ఎఫ్ఏఏ, ఎన్‌టీఎస్‌బీ దర్యాప్తు ప్రారంభం
- ప్రమాదంతో బాంగర్ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేత

అమెరికా– సూర్య వాస్తవం

అమెరికాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. మయానే రాష్ట్రంలో భారీ మంచు తుపాను మధ్య ఓ ప్రైవేట్ జెట్ టేకాఫ్ సమయంలో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మరణించగా, ఒకరు తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే, బాంగర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బంబార్డియర్ ఛాలెంజర్ 600 ప్రైవేట్ జెట్ ఆదివారం రాత్రి 7:45 గంటలకు టేకాఫ్ అయింది. విమానంలో ప్రయాణికులు, సిబ్బందితో కలిపి మొత్తం 8 మంది ఉన్నారు. టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే విమానం అదుపుతప్పి తలకిందులుగా పడిపోయింది. వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. టేకాఫ్ క్లియరెన్స్ ఇచ్చిన 45 సెకన్ల తర్వాత "విమానం తలకిందులుగా పడింది" అని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రికార్డింగ్‌లో ఓ వాయిస్ వినిపించడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో అమెరికా తూర్పు తీరంలో తీవ్రమైన మంచు తుపాను కొనసాగుతోంది. బాంగర్ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా మంచు కురుస్తున్నప్పటికీ, విమానాల రాకపోకలు జరుగుతున్నాయని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ తెలిపారు. సమాచారం అందిన నిమిషంలోపే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మరణించారని, సిబ్బందిలో ఒకరు ప్రాణాలతో బయటపడ్డారని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ధృవీకరించింది. నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించింది. ప్రమాదానికి గల కారణాలపై పూర్తిస్థాయి దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. ప్రమాదం కారణంగా బాంగర్ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు.

## తొలిసారి అమరావతిలో...

# ఘనంగా గణతంత్ర వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ జెండాను ఎగురవేస్తున్నాం. రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్న వారితో ఈ శుభక్షణాలను పంచుకోవడం గర్వకారణం. గతంలో రాజధాని నిర్మాణం ఆగిపోయింది. ఆర్థిక విశ్వాసం దెబ్బతింది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఫలితాలు స్పష్టంగా కనపడుతున్నాయి' అని అన్నారు. విద్య, ఆరోగ్యం, వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతిస్తోందన్నారు. ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని అందులో భాగంగా మెగా డిఎస్?సి నిర్వహించం, పోలీస్? నియామకాలు చేపట్టడంతో పాటు, స్కిల్ పాస్?పోర్టు, నైపుణ్యం ప్లాట్ ఫామ్ ద్వారా యువతను సిద్ధం చేస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ద్వారా 7.5లక్షల ఉద్యోగాలు కొత్త పరిశ్రమలు, థీమాటిక్? నగరాలు అభివృద్ధిలో ఉన్నాయన్నారు. కొత్త ఫ్యామిలీ బెనిఫిట్? మేనేజ్?మెంట్? సిస్టమ్ ద్వారా 2026 జూన్ నుంచి కుటుంబ కార్డులు జారీ చేస్తామని గవర్నర్ తెలిపారు. లక్షలాదిమందికి జీవనాధారమైన రైతులు, మత్స్యకారులు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, భవిష్యత్తును నిర్మిస్తున్న మహిళలు, ఉపాధిని సృష్టిస్తున్న పారిశ్రామికవేత్తలందరూ రాష్ట్ర ప్రగతికి నిజమైన శిల్పులని గవర్నర్ అభివర్ణించారు.

## సాంకేతికతతో ఉద్యోగులపై

# పనిభారం తగ్గించండి

(మొదటిపేజీ తరువాయి)

ఐటి కార్యదర్శి కాటమనేని భాస్కర్, ముఖ్యమంత్రి కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, సమాచార, పౌరసంబంధాలశాఖ డైరెక్టర్ కెఎస్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## వాయు కాలుష్యంతో

# ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో వాయు కాలుష్యం సమస్య కారణంగా ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా చిన్నారులు, వయోవద్ధుల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. ఈ సంక్షోభాన్ని విస్మరించరాదని, మార్పు దిశగా మొదటి అడుగు మన గళాన్ని వినిపించడమేనని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. 'వాయు కాలుష్యం కారణంగా ఆరోగ్యం, ఆర్థిక రూపంలో ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. కోట్లాది మంది సామాన్య పౌరులు రోజూ ఈ భారాన్ని మోస్తున్నారు. ప్రజల జీవనోపాధి దెబ్బతింటోంది. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలపై తీవ్ర ప్రభావం పడుతోంది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## హార్వర్డ్ యూనివర్సిటీలో

# విద్యార్థిగా మారిన సీఎం రేవంత్ రెడ్డి

- 'లీడర్‌షిప్ ఇన్ 21వ శతాబ్దం' కోర్సులో చేరిక
- భారీ హిమపాతం, ప్రతికూల వాతావరణంలోనే తరగతులకు హాజరు
- సీఎం అమెరికా పర్యటనపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు
- ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకే ప్రాధాన్యతా అని ప్రశ

హైదరాబాద్– సూర్య వాస్తవం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో తన ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న కెన్నడీ స్కూల్‌లో 'లీడర్‌షిప్ ఇన్ ది 21వ సెంచరీ: కేయాస్, కాన్‌ఫ్లిక్ట్, అండ్ కరేజ్' అనే కోర్సులో ఆయన చేరారు. ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం ప్రోగ్రామ్ ఓరియంటేషన్, సహ విద్యార్థుల పరిచయంతో తరగతులు మొదలయ్యాయని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. ఈ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి వివిధ తరగతులు, కేస్ స్టడీ అనాలిసిస్, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్‌లో పాల్గొంటున్నారు. ఈ కోర్సులో భాగంగా ఆయన ఇతర విద్యార్థులతో కలిసి అసైన్?మెంట్లు, హోంవర్క్, గ్రూప్ ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంటుంది. జనవరి 30 వరకు ఈ తరగతులు కొనసాగుతాయి. కోర్సు పూర్తయ్యాక రేవంత్ రెడ్డి హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ముఖ్యమంత్రి పదవిలో ఉండగా ఐవీ లీగ్ యూనివర్సిటీలో ఇలాంటి కోర్సులో చేరడం ఇదే తొలిసారని సీఎంవో పేర్కొంది. ఐదు ఖండాలకు చెందిన 20కి పైగా దేశాల నుంచి వచ్చిన వారు ఈ తరగతులకు హాజరవుతున్నారు. మరోవైపు, బోస్టన్ ప్రాంతంలో 'ఫెర్న్' అనే మంచు తుపాను కారణంగా అత్యవసర పరిస్థితి నెలకొంది. రెండు అడుగుల మేర హిమపాతం, మైనస్ 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంతటి ప్రతికూల వాతావరణంలోనూ రేవంత్ రెడ్డి తరగతులకు హాజరవుతున్నారు. గత వారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన నేరుగా అమెరికా వెళ్లారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్?లో కోర్సులో చేరడంపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పించింది. నాయకత్వం అనేది స్వల్పకాలిక కోర్సుల ద్వారా కాకుండా, పాలన, జవాబుదారీతనం, క్షేత్రస్థాయిలో ఫలితాల ద్వారా నిరూపించుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ వ్యాఖ్యానించారు. "ఇలాంటి అకడమిక్ కోర్సులను జీవితంలో ముందే పూర్తి చేయాల్సింది కదా?" అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి అసలైన తరగతి గది ఆయన పాలిస్తున్న రాష్ట్రమే కానీ, విదేశీ క్యాంపస్ కాదని ఎద్దేవా చేశారు. ఈ పర్యటన ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా ఉందని, దీనికి అవుతున్న ఖర్చుపైనా ఆయన సందేహాలు వ్యక్తం చేశారు.

# అవార్డులను పంపిణీ చేసిన కలెక్టర్ శ్యాం ప్రసాద్







శ్రీ సత్యసాయిబ్యూరో సూర్య వాస్తవం

గణతంత్ర దినోత్సవం శ్రీ సత్య సాయి జిల్లాలో సోమవారం ఘనంగా జరిగింది గత నాలుగు ఐదు రోజుల ముందు నుంచి జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు.

సోమవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎస్పీ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ విధి నిర్వహణలో నైపుణ్యత సాధించడంతో వారికి ఉత్తమ అధికారి అవార్డులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నాట్యాలు వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.







## శాంతికాముక దేశం

# ఇండియా

(మొదటిపేజీ తరువాయి)

"నారీశక్తి" కీలకమన్నారు. గ్రామీణ స్వయం సహాయక బృందాల నుంచి అంతరిక్షం వరకు ఆధునిక భారతదేశం యొక్క కథను దాని కుమార్తెలు రాస్తున్నారని ప్రశంసించారు. పంచాయతీ రాజ్ సంస్థల్లో దాదాపు 46 శాతం మంది మహిళా ప్రతినిధులు ఉన్నారని అన్నారు. గతేడాది క్రీడారంగంలో మన అమ్మాయిలు చారిత్రాత్మక విజయాలు సాధించారని తెలిపారు. ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్, అంధుల మహిళల 20 ప్రపంచ కప్‌ల విజయాలను ఆమె ఉదహరించారు. అలాగే, పేదరిక నిర్మూలనలో భారతదేశం వేగంగా పురోగతి సాధిస్తుందని తెలిపారు. దశాబ్దాలుగా పేదరికంతో పోరాడుతున్న లక్షలాది మంది పౌరులను దారిద్ర్యరేఖకు పైకి చేర్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు దాదాపు 81 కోట్ల మంది లబ్దిదారులకు కీలకమైన సహాయాన్ని అందిస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగం ఇప్పుడు 22 భాషలలో అందుబాటులో ఉందని అధ్యక్షుడు ముర్ము ప్రకటించారు. ఈ మైలురాయి "రాజ్యాంగ జాతీయతను" పెంపొందించడం, పౌరులు తమ మాతృభాషలో దేశపు ప్రాథమిక పత్రంతో నిమగమవ్వడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. డిజిటల్? ఆర్థిక వ్యవస్థలో భారత్? ప్రపంచ నాయకుడిగా ఎందిగిందని చెప్పారు. ప్రపంచంలో జరుగుతున్న డిజిటల్? లావాదేవీలలో సగానికి పైగా భారతదేశంలోనే జరుగుతున్నాయని ఆమె అన్నారు. అలాగే, భారతదేశం సమీప భవిష్యత్తులోనే ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా పయనిస్తోందని ఆమె అన్నారు. జిఎస్?టిని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆర్థిక సమైక్యతకు అత్యంత ముఖ్యమైన నిర్ణయంగా రాష్ట్రపతి అభివర్ణించారు. 'వందేమాతరం' గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న వేడుకలను కూడా రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో 'వందేమాతరం' భాషాపరమైన అడ్డంకులను

## బలమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి కృషి చేసిన వారిని స్మరించుకోవాలి

- అర్బన్ సీఐ సీతారామిరెడ్డి

**పులివెందుల – సూర్య వాస్తవం :** 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచిందని పులివెందుల అర్బన్ సీఐ సీతారాం రెడ్డి పేర్కొన్నారు. సోమవారం 77వ గణతంత్ర వేడుకలను అర్బన్ స్టేషన్ కార్యాలయంలో సీఐ సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్రం వచ్చిందని, భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించిన తర్వాత జనవరి 26 గణతంత్ర వేడుకలను జరుపుకుంటామన్నారు. స్వాతంత్రానికి మరియు రాజ్యాంగ నిర్మాణానికి కృషిచేసిన ఎందరో మహానుభావులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల అర్బన్ స్టేషన్ పోలీస్ సిబ్బంది మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశం కోసం నాయకులు చేసిన త్యాగాలు మరువలేనివి

- అంబేద్కర్ విగ్రహం నివాళులర్పించిన దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్

**పులివెందుల– సూర్య వాస్తవం :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పులివెందుల పట్టణంలోని పాత ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి అన్నారు. మహనీయుల త్యాగాలను ఈనాటి యువత స్ఫూర్తి గా తీసుకోవాలని దేశం ప్రగతి కోసం ముందడుగు వేయాలని ఆయన అన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# సంపాదకీయం

## రాష్ట్రాలతో గవర్నర్ల పంచాయితీ




దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం గవర్నర్ల తీరుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కేంద్ర–రాష్ట్ర సంబంధాల మధ్య వారధిగా ఉండాల్సిన గవర్నర్లు, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలతో ఢీ అంటే ఢీ అనే స్థాయికి వెళ్లడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగిస్తోంది. భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి అధిపతి గవర్నర్. కానీ, అధికారం మాత్రం ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వానిదే. అయితే ఇటీవల కాలంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటకలలో గవర్నర్లు అనుసరిస్తున్న తీరు రాజ్యాంగ సంప్రదాయాలను తుంగలో తొక్కేలా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పుకు గౌరవం ఇవ్వాల్సిన స్థానంలో ఉన్న వ్యక్తులు, రాజకీయ ఏజెంట్లుగా మారుతున్నారా? అనే సందేహాలు కలగక మానవు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 176(1) ప్రకారం, ప్రతి ఏటా మొదటి అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగించడం ఒక తప్పనిసరి ప్రక్రియ. ఈ ప్రసంగం గవర్నర్ వ్యక్తిగత అభిప్రాయం కాదు అది ప్రభుత్వం రూపొందించిన విధాన పత్రం. కానీ, ప్రస్తుత గవర్నర్లు ఈ సంప్రదాయానికి తూట్లు పొడుస్తున్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి జాతీయ గీతం అంశాన్ని తెరపైకి తెచ్చి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే 'తమిళ్ తాయి వాల్తు' విషయంలో ఆయన వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రభుత్వ హక్కులను ప్రశ్నించడమే అవుతుంది. తమిళనాడు అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి ప్రసంగించాల్సిన గవర్నర్ మధ్యలోనే వెళ్లిపోయారు. సభలో జాతీయ గీతం పాడాలని కోరినా సభాపతి వినిపించుకోలేదని లోక్‌భవన్ వెల్లడించింది. దేశంలోని అన్ని శాసన సభలలో గవర్నర్ ప్రసంగానికి ముందు జాతీయ గీతాలాపన చేయడం సంప్రదాయంగా కొనసాగుతోందని, స్టాలిన్ సర్కారు మాత్రం ఈ సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తోందని పేర్కొంది. దీనికి నిరసనగా గవర్నర్ ఆర్.ఎన్.రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసినట్లు సమాచారం.కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ప్రస్తుత గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఇప్పుడు ప్రసంగంలోని కొన్ని భాగాలను కావాలనే వదిలేయడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలు ఉండకూడదనే నెపంతో ప్రభుత్వం పంపిన స్క్రిప్ట్‌ను ఎడిట్ చేయడం రాజ్యాంగ విరుద్ధం. తాజాగా కర్ణాటక గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ కూడా ఇదే బాట పట్టారు. కేంద్రంపై విమర్శలు ఉన్న భాగాలను దాటవేస్తూ ఆయన ప్రసంగించడం, రాష్ట్ర ప్రభుత్వంపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.రాజ్యాంగ పరిషత్ చర్చల్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గవర్నర్ల పాత్రను చాలా స్పష్టంగా వివరించారు. గవర్నర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం చాలా పరిమితమని, రాష్ట్ర మంత్రిమండలి సూచనల మేరకే ఆయన నడుచుకోవాలని స్పష్టం చేశారు. సాధారణంగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన ప్రసంగ పాఠాన్ని గవర్నర్ చదవడం ఆనవాయితీ. అయితే, గురువారం సభకు వచ్చిన గవర్నర్ గహ్లోత్ ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రతిని పక్కన పెట్టారు. "ఈ రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని కేవలం రెండు లైన్లు మాత్రమే చదివి సభ నుండి వెళ్లిపోయారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలు ప్రసంగంలో ఉండటం పట్ల ఆయన ముందుగానే అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.గవర్నర్ తీరుపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. క్యాబినెట్ నిర్ణయాలను గౌరవించకుండా గవర్నర్ రాజ్యాంగ వ్యతిరేక చర్యకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగాన్ని కాదని, ఆయన సొంతంగా సిద్ధం చేసుకున్న వ్యాఖ్యలు చేయడం చెల్లదని పేర్కొన్నారు. దీనిపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీఎం స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగాలను యథావిధిగా చదివిన గవర్నర్, ఈసారి వ్యూహాత్మక మార్పు చేయడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కేంద్ర–రాష్ట్ర సంబంధాల విషయంలో గవర్నర్ కార్యాలయం రాజకీయ వేదికగా మారుతోందని వారు విమర్శిస్తున్నారు. ఈ పరిణామంతో కర్ణాటకలో పాలక పక్షం, గవర్నర్ మధ్య ఉన్న సంబంధాలు మరింత క్షీణించే అవకాశం కనిపిస్తోంది.బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలోని "ది కింగ్ కెన్ డు నో రాంగ్" అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగంలో తప్పులున్నా, ఒప్పిదాలున్నా దానికి బాధ్యత ప్రభుత్వానిదే తప్ప గవర్నర్ది కాదు. కాబట్టి, దానిని యథాతథంగా చదవడం గవర్నర్ బాధ్యత. గవర్నర్లు తమకు నచ్చిన పేరాలను చదివి, నచ్చనివి వదిలేయడం వల్ల సభలో జరిగే ధన్యవాద తీర్మానంపై చర్చ అసంపూర్ణంగా మారుతుంది. ప్రభుత్వం ఏయే అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని భావిస్తుందో, వాటిని గవర్నర్ అడ్డుకోవడం అంటే పరోక్షంగా ప్రజాతీర్పును అడ్డుకోవడమే. గవర్నర్ వ్యవస్థ అనేది కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం ఉండాలి కానీ, రాష్ట్ర ప్రభుత్వాల పనులకు ఆటంకం కలిగించే స్పీడ్ బ్రేకర్ లా మారకూడదు. గవర్నర్లు ఒక రాజకీయ పార్టీ ప్రతినిధులుగా కాకుండా, రాజ్యాంగ రక్షకులుగా వ్యవహరించాలి. సుప్రీంకోర్టు సైతం గతంలో పలు సందర్భాల్లో గవర్నర్ల పరిధిని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలతో ఘర్షణ పడటం వల్ల అభివృద్ధి కుంటుపడటమే కాకుండా, సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నవారు వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలను పక్కన పెట్టి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# క్రాస్ రోడ్స్‌లో వైఎస్ జగన్..

## - సజ్జల వైపా, విజయసాయి వైపా..



**విజయవాడ – సూర్య వాస్తవం**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కోటరీ రగడ ఇప్పుడు బహిరంగ చర్చకు వచ్చేసింది. పార్టీ ఆవిర్భావం నుండి జగన్ వెన్నంటే ఉండి, 2019 విజయపథంలో కీలక పాత్ర పోషించిన విజయసాయిరెడ్డి, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి, జగన్‌కు దూరమయ్యారు. కానీ తాను జగన్ కోసం పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన సంకేతాలు పంపుతున్నారు. కాకపోతే ప్రస్తుతం ఉన్న సజ్జల కోటరీని బయటకు పంపాలంటున్నారు. దీంతో జగన్ కు ఇప్పుడు కొత్త ఆలోచనలు వచ్చే అవకాశం ఉంది. ఒకప్పుడు జగన్ 'ఏ–2'గా, పార్టీకి వెన్నెముకగా భావించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు దూరమయ్యారు. అయితే తాను జగన్‌కు దూరం కాలేదని, తనను జగన్ నుండి ప్రస్తుతం ఉన్న కోటరీ సభ్యులే దూరం చేశారని ఆయన బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి సహా ప్రస్తుతం జగన్ చుట్టూ ఉన్న వారికి కనీస రాజకీయ పరిజ్ఞానం లేదని, వారు జగన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించడం పార్టీలో ఉన్న తీవ్ర విభేదాలను సూచిస్తోంది. తనను తిరిగి పార్టీ బాధ్యతల్లోకి తీసుకుంటే కూటమిని విడగొట్టి, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతానని ఆయన చేస్తున్న ప్రకటన వైసీపీ శ్రేణుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. వైసీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో విజయసాయిరెడ్డి పట్ల సానుకూలత కనిపిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి, బూత్ స్థాయి వరకు యంత్రాంగాన్ని నడిపించిన ఘనత విజయసాయిరెడ్డిదేనని మెజారిటీ కార్యకర్తలు నమ్ముతున్నారు. అదే సమయంలో 2024 ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి సజ్జల రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని కోటరీ అనుసరించిన అతి విశ్వాసం, కార్యకర్తలకు నేతలను దూరం చేసిన తీరే కారణమని క్యాడర్ బలంగా విశ్వసిస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను జగన్ దృష్టికి వెళ్లకుండా అడ్డుకున్నారనే అపవాదు సజ్జల కోటరీపై బలంగా పడింది.ప్రస్తుతం జగన్ మోహన్ రెడ్డి ఒక కీలకమైన కూడలిలో ఉన్నారు. ఆయన ముందు ప్రధానంగా రెండు మార్గాలు కనిపిస్తున్నాయి ఒకటి, గడిచిన ఐదేళ్లుగా తన వెన్నంటే ఉండి, పార్టీ విధానాలను నడిపించిన సజ్జల. ప్రస్తుత కోటరీనే నమ్ముకుని ముందుకు సాగడం. రెండు, పాత మిత్రుడిని, వ్యూహకర్తను విశ్వసించి విజయసాయిరెడ్డికి మళ్లీ పగ్గాలు అప్పగించడం. అయితే, జగన్ సాధారణంగా తాను నమ్మిన వారిని వదులుకోవడానికి ఇష్టపడరని, కానీ ఇప్పుడు పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడిన తరుణంలో ఆయన తన పంథాను మార్చుకుంటారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. విజయసాయిరెడ్డి ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులతో వ్యక్తిగత సంబంధాలను కలిగి ఉన్నారు. ఆయనను పక్కన పెట్టడం వల్ల ఉత్తరాంధ్రతో పాటు పలు జిల్లాల్లో పార్టీ పట్టు కోల్పోయిందనే వాదన ఉంది. మరోవైపు, సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని విభాగాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేసినప్పటికీ, అది కేవలం పాలనాపరమైన సలహాలకే పరిమితమైందని, రాజకీయ వ్యూహాల్లో ఆయన విఫలమయ్యారని పార్టీలోని ఒక వర్గం భావిస్తోంది. ఇప్పుడు విజయసాయిరెడ్డి నేరుగా సవాల్ విసురుతున్నందున జగన్ ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఏపీలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అత్యంత పటిష్టంగా ఉంది. ఇటువంటి బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాలంటే కేవలం సామాజిక సమీకరణాలు మాత్రమే సరిపోవని, రాజకీయంగా చీలికలు తెచ్చే పక్కా వ్యూహాలు అవసరమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడుతున్నారు. ఆయనకు ఉన్న పాత నెట్‌వర్క్, రాజకీయ చాణక్యం ఇప్పుడు పార్టీకి అవసరమని క్యాడర్ కోరుకుంటోంది. జగన్ తన కోటరీని ప్రక్షాళన చేయకుండా కేవలం ప్రజల్లోకి వెళ్తే ఫలితం ఉండదని, లోపల వ్యవస్థను మార్చాలని కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో జగన్ కోటరీలో మార్పులు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ విజయసాయిరెడ్డిని జగన్ ఆహ్వానిస్తే సజ్జల కోటరీ బయటకు పోవాల్సి ఉంటుంది. జగన్ ఇప్పటికీ మౌనంగానే ఉంటూ పరిణామాలు గమనిస్తున్నారు. విజయసాయిరెడ్డి చేస్తున్న ప్రతి పాదన జగన్ హృదయాన్ని గెలుచుకుంటుందా లేక కోటరీ గోడలకు తగిలి వెనక్కి వస్తుందా అనేది వేచి చూడాలి.

# లోకల్ పోల్స్‌కు జనసేన ప్లాన్



**కాకినాడ – సూర్య వాస్తవం**

పార్టీ పెట్టినప్పటి నుంచి పవన్ స్ట్రాంగ్‌గా ఓ నమ్మకం మీదే ఉంటూ వస్తున్నారు. 20 ఏళ్లు పోరాడడానికి కూడా సిద్ధం. కానీ వన్స్ వి స్టెప్ ఇన్..పాతుకు పోతామంటూ చెప్పుకొచ్చారు. ఎవరి మీదో ఆధారపడి..ఏ పార్టీ నుంచో లీడర్లు వస్తారని..ఆశపడట్లేదు. నాయకులు ఎక్కడి నుంచో రారు. కార్యకర్తలనే లీడర్లుగా తీర్చిదిద్దుతామంటున్నారు.ఇదే విషయంపై గత కొన్ని రోజులుగా సీరియస్ ఫోకస్ పెట్టారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే పనిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 21 అసెంబ్లీ, ఇద్దరు ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్సీలు, ముగ్గురు మంత్రులు, పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లతో బలంగా ఉన్న పార్టీని రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేయాలని ఫిక్స్ అయిపోయారు. కూటమిలో భాగస్వామ్యంగా ఉంటూనే సొంతంగా బలపడేందుకు వ్యూహ రచన చేస్తున్నారు.అధికారం, విపక్షం అన్న తేడా లేకుండా.. రోల్ ఏదైనా పది కాలాల పాటు పార్టీ నిలబడాలని కలలు కంటున్నారు పవన్. ఇందుకోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పటిష్టతపై ఫోకస్ పెట్టి..పార్టీ కమిటీలు నియామక ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. మార్చి 14న జనసేన ఆవిర్భావ దినోత్సవం నాటికి కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని డెడ్ లైన్ పెట్టారు.పార్టీలో జరుగుతున్న కొన్ని అంతర్గత సంఘటనలపైనా పవన్ దృష్టి పెట్టారట. వీటిపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై జనసేన నేతలతో ఇటీవలే పవన్ సమావేశం నిర్వహించారు. కొందరు పార్టీ నేతల చుట్టూ ఉన్న వివాదాలు ఆర్థిక, వ్యక్తిగత ఘర్షణలు, మానసిక బలహీనతలు, వ్యక్తిగత, కుల విభేదాలు, వివాహేతర సంబంధాల విషయంలో జరుగుతున్న గొడవలపై పవన్ ఆరా తీసినట్లు ఇన్‌సైడ్ టాక్.అలాంటివన్నీ వ్యక్తిగత అంశాలుగా మాత్రమే చూడాలని..పార్టీ పరంగా వారిపై యాక్షన్ తీసుకోవాలని ముఖ్య నేతలకు సూచించారు పవన్. అయితే ఇలాంటివన్నీ పార్టీకి ఆపాదించే కుట్ర జరుగుతుందని అలాంటి వాటిని తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచిస్తున్నారు పవన్. అయితే పవన్ ఇంతలా పార్టీపై ఫుల్ ఫోకస్ పెట్టడానికి ప్రధాన కారణం స్థానిక సంస్థల ఎన్నికలే అంటున్నారు నేతలు.సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు మాత్రమే తీసుకున్న పవన్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో..మెజార్టీ స్థానాలు తీసుకుని పట్టు సాధించేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారట.

కూటమిలో భాగంగా జనసేనకు బలం ఉన్న చోట్ల ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే యోచనలో ఉన్నారట. మార్చిలోపు పార్టీ నిర్మాణం పూర్తి చేసి..స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలనేది పవన్ ఆలోచనగా చెబుతున్నారు. పాలిటిక్స్ ఈజ్ ఆల్‌వేస్ డైనమిక్స్. రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎప్పటికప్పుడు పరిస్థితులను బట్టి మారుతూనే ఉంటాయ్. పాలిటిక్స్ ఎప్పుడు ఎలా ఉంటాయో ఎవరు చెప్పలేని పరిస్థితి. పైగా ప్రజెంట్ పాలిటిక్స్ అయితే వెరీ డిఫరెంట్. ఇవాళ ఓ పార్టీలో ఉన్న నేత రేపు ఏ పార్టీలో ప్రత్యక్షం అవుతారో.. ఎందుకు పార్టీ మారుతారో అంతకంటే అర్థం కానీ పొలిటికల్ సినారియో ఈనాటిది. రాజకీయం అంటే అవసరాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు అన్నట్లుగా మారిపోయిన సిచ్యువేషన్. కానీ జనసేన పుట్టుక వేరు. అది నడుస్తున్న తీరు వేరు. ఓ లక్ష్యం కోసం.. రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్తుంటారు పవన్ కల్యాణ్. తానే రెండుచోట్ల ఓడినా.. ఆయన పార్టీ ఎక్కువ రోజుల ఉండదని విమర్శలు వచ్చినా.. ఆయనెక్కడా తగ్గలేదు. పదవుల కోసం ఆరాటపడలేదు. కానీ పార్టీని మాత్రం లైమ్‌లైట్‌లో ఉంచుతూ వచ్చారు. ఎందుకంటే గతంలో ఎంతోమంది పార్టీలు పెట్టి కొన్ని రోజులు పాలిటిక్స్‌లో ఉండి తిరిగి బ్యాక్ టు పెవిలియన్ అన్నవారున్నారు. కానీ పవన్ రూటు సెపరేటు. ఆయనదంత ఫ్యూచర్ ప్లాన్. అధికారం, ప్రతిపక్షం అనే మాటల కంటే.. మంచి కోసం మార్పు అనే లైన్‌లోనే పనిచేసుకుంటూ వస్తున్న సేనాని ఇప్పుడు సరికొత్త స్కెచ్ వేస్తున్నారట. జనసేన అనేది అధికారం కోసం.. అవసరాల కోసం ఏర్పడలేదని ప్రూవ్ చేసేందుకు.. రాబోయే తరానికి మంచి నేతలను..మంచి రాజకీయ సంప్రదాయాలను అందించేలా ఫ్యూచర్ ప్లాన్ రెడీ చేశారట. అందుకు స్థానిక సంస్థల ఎన్నికలను, మున్సిపోల్స్‌ను అస్త్రంగా మార్చుకోవాలని భావిస్తున్నారట సేనాని. పవన్ స్ట్రాటజీస్ ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి మరి.

# మారుతున్న నగరి లెక్కలు

**తిరుపతి– సూర్య వాస్తవం**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. గత ఎన్నికల సమయంలో కనిపించిన సమీకరణలకు భిన్నంగా ఇప్పుడు పరిస్థితులు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ మార్పులు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకురాలు రోజా రాజకీయ భవితవ్యంపై చర్చను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నాయి. ఒకప్పుడు నగరి పరిసర మండలాల్లో రోజా పేరు బలంగా వినిపించేది. కానీ గత ఎన్నికలకు ముందే ఆమె ఉనికి తగ్గినట్టు కనిపించగా, ఇప్పుడు మరింత మౌనం నెలకొన్నట్టు రాజకీయ వర్గాలు మాట్లాడుకుంటున్నాయి.నగరి నియోజకవర్గంలో నింద్ర, విజయపురం, నగరి, పుత్తూరు, వడమాలపేట వంటి మండలాలు ఉన్నాయి. వీటిలో గత ఎన్నికలకు ముందు వరకు నింద్ర, వడమాలపేటల్లో రోజాకు గట్టి మద్దతు ఉందనే భావన ఉండేది. మంత్రిగా ఉన్న రోజుల్లో కూడా ఆమె ఈ రెండు మండలాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారని స్థానికులు గుర్తు చేస్తారు. తరచూ పర్యటనలు, కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఇవే తన బలం ఉన్న ప్రాంతాలుగా రోజా చెప్పుకొనేవారు.నగరి మండలంలో పరిస్థితి మాత్రం సమంగా ఉండేది. అభిమానులు ఉన్నప్పటికీ వ్యతిరేకత కూడా అంతే స్థాయిలో ఉండేది. విజయపురం, పుత్తూరులో అయితే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. అక్కడ వైసీపీ వర్గాలు రెండు గ్రూపులుగా విడిపోయాయి. ఈ పరిణామాలు గత ఎన్నికలకు ముందే మొదలయ్యాయి. అదే సమయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభావం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటం కూడా రోజాకు సవాలుగా మారింది. ఈ కారణాల వల్ల ఆమె నింద్ర, వడమాలపేటలపైనే ఎక్కువగా ఆధారపడినట్టు కనిపించింది. అయితే తాజా రాజకీయ పరిణామాలు ఈ రెండు మండలాల్లో కూడా మార్పు వస్తున్నాయనే సంకేతాలు ఇస్తున్నాయి. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నియోజకవర్గం అంతటా చురుకుగా పర్యటిస్తున్నారు. తమకు బలం ఉన్న ప్రాంతాలతో పాటు బలహీనంగా ఉన్న మండలాలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టడం ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో అమలు చేయడం, సమస్యలపై వెంటనే స్పందించడం వల్ల ప్రజల్లో ఆయన పట్ల అనుకూలత పెరుగుతోందని అంటున్నారు.ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కూడా ఊపందుకున్నాయి. ఈ పరిణామాల ప్రభావంతో గతంలో రోజాకు అంతో ఇంతో మద్దతు కనిపించిన నింద్ర, వడమాలపేటల్లో ఇప్పుడు ఆమె పర్యటనలకు పెద్దగా స్పందన లేకపోతున్నట్టు చర్చ సాగుతోంది. ఒకప్పుడు కనిపించిన స్వాగతాలు, హడావిడి ఇప్పుడు తగ్గినట్టు స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ మారుతున్న రాజకీయ సమీకరణలు వచ్చే ఎన్నికల నాటికి ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. నగరి నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు రోజా రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయా? లేక ఆమె మళ్లీ తన పాత బలాన్ని సమీకరించగలుగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానం కాలమే చెప్పాల్సి ఉంది. కానీ ప్రస్తుతానికి మాత్రం నగరిలో రాజకీయ గాలి మారుతోందన్న మాట వినిపిస్తోంది.



# ప్రధాని ప్రశంసలందుకున్న రాయదుర్గం నగరవనం

- ప్రధాని నోట రాయదుర్గం మాట...
- కష్టానికి తగిన గుర్తింపు :
  ఎమ్మెల్యే కాలవ హర్షం..
- ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** "మన్ కీ బాత్"లో ప్రధాని నరేంద్ర మోడీ రాయదుర్గం నగరవనాన్ని ప్రశంసించటం పట్ల ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హర్షం వ్యక్త పరిచారు. తమ శ్రమకు తగిన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాయదుర్గం నియోజకవర్గ కూటమి నాయకులు మీడియా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులతో కలసి సోమవారం ఆయన రాయదుర్గం నగరవనాన్ని సందర్శించారు. గత తెలుగుదేశం పార్టీ పాలనలో అక్కడ చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ... 2026 సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం నిర్వహించిన తొలి "మన్ కీ బాత్" కార్యక్రమంలో అనంతపురం జిల్లాలో జల సంరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ... రాయదుర్గం నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలిచిందని, నగరవణాన్ని ఉద్దేశిస్తూ ప్రశంసించడం మనందరికీ గర్వకారణమన్నారు. అనంతపురం జిల్లా ప్రజల పక్షాన, కూటమి పార్టీల పక్షాన ప్రధానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో 2014-19 మధ్యన తన విజ్ఞప్తి మేరకు అప్పటి అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణరెడ్డి రాయదుర్గం నగరవణాన్ని మంజూరు చేశారన్నారు. 50 హెక్టార్ల విస్తీర్ణంలో దీన్ని అభివృద్ధి చేయటానికి అనుమతులు ఇచ్చారన్నారు. జల సంరక్షణ కార్యక్రమాలు, పట్టణ ప్రజలకు వినోదాన్ని పరిచే కార్యక్రమాలు, చిన్నపిల్లల ఆడుకోవడానికి తగిన వసతులు కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో ఇక్కడ వసతి కూడా కల్పించాలన్నది తన సంకల్పమని త్వరలోనే దాన్ని కూడా నెరవేరుస్తామన్నారు. పర్యావరణ హితాన్ని కోరుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అట్లాగే పచ్చదనాన్ని పెంచడానికి నిర్విరామంగా కృషి చేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ సహకారంతో ఈ నగరవణాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు.

2014 -19 మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని పెంచడానికి భూగర్భ జలాల సంరక్షణకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఎంతగానో కృషి చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల పంటకుంటలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా అందులో ఆరు లక్షల పంట కుంటలు అనంతపురం జిల్లాలోనే నిర్మించడం జరిగిందన్నారు. దాదాపు రూ.213 కోట్లు జిల్లాలో జల సంరక్షణ కోసం ఉపాధి హామీ నిధులను ఖర్చు పెట్టినట్లు వివరించారు. వాటితో 30వేలకు పైగా నీటి సంరక్షణ స్ట్రక్చర్స్ నిర్మించామని దాంతో నేడు జిల్లాలో 10.56 మీటర్ల లోతులో భూగర్భ జలం లభ్యమవుతున్నాయన్నారు. అయితే వర్షాకాలంలో ఐదు మీటర్ల లోతులో, ఎండా కాలమైతే ఎనిమిది మీటర్ల లోతులో నీరు లభ్యమయ్యేలా ఉండాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని వివరించారు. ఆయన ఆశయానికి అనుగుణంగా పనులు వేగంగా జరుగుతుండగా... 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి భూగర్భ జలాల గురించి పట్టించుకోక పోవడంతో పచ్చదనము కనుమరుగైపోయిందని ఆందోళన వ్యక్తపరిచారు. చంద్రబాబు నాయకత్వంలో ఏడాదిన్నర కిందట ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మళ్లీ పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ పనులను వేగవంతం చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శనంలో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో కూటమి పార్టీల నాయకులందరూ కలసికట్టుగా పని చేస్తామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల కన్వీనర్ కురుబ హనుమంతు, మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ, అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, పద్మశాలి డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, బిజెపి నాయకులు వసుంధర దేవి, ఆంబోజి రావ్, హీరోజి రావ్, బుదురు తిప్పేస్వామి, రావుత్ రాజశేఖర్, ఎల్లప్ప, భలే శంకర్, ఇనాయత్,తదితరులు పాల్గొన్నారు.





## శివారెడ్డిని పరామర్శించిన తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లి శ్రీ వృషభ చలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ శివారెడ్డి తిరుపతిలోని బర్డ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇటీవలే ఇంటికి వచ్చారు.ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి శివారెడ్డిని పరామర్శించారు.ఆయనతోపాటు గండి దేవస్థానం మాజీ చైర్మన్ రమణ, అమర్నాథ్ రెడ్డి, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బ్యాంకు శ్రీనివాసులు, నామా వినయ్ శివారెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## దుద్దె వెంకటసుబ్బయ్య నేత్రదానం

- ఇద్దరు అంధులకు చూపు





**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణం పార్నపల్లి రోడ్ లోని దుద్దె వెంకటసుబ్బయ్య (90 సంవత్సరాలు) మరణించడంతో ఆయన కుమారుడు పుల్లయ్య, కుమార్తె అంజనాదేవి, కోడలు కుమారి, అల్లుడు మధుసూదన్, మనవళ్లు మణికంఠ, భరత్, మనవరాళ్లు నాగ మంజుల, శ్రీవల్లి లు నేత్రధానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు కి సమాచారం ఇవ్వడం తో అనంతపురం చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డి వై కుళ్లాయప్ప నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ రాఘవేంద్ర తో కలిసి మృతురాలి ఇంటి వద్ద పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్టు రాజు తెలిపారు.ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టి లో కలిసి పోయే నేత్రాలు దానం చేసేందుకు నేత్రదానం పై ప్రతి కుటుంబం అవగాహన కలిగి 9966509364 కి సంప్రదించాలని ఆయన కోరారు.నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## మున్సిపల్ ఇన్‌ఛార్జికి కమిటీ జాబితా అందజేత



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల మున్సిపాలిటీలోని 20 వార్డు కమిటీ జాబితా మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌కి వైసీపీ నాయకులు నర్సారెడ్డి వీరారెడ్డి తదితరులు అందజేశారు. సోమవారం వైయస్ మనోహర్ రెడ్డి నివాసంలో, ఓటర్ల జాబితాలో నమోదు చేయించుకున్న గ్రామ సభలో సభ్యులు వార్డు కమిటీలు గా ఏర్పడి స్థానిక పాలనలో ప్రజలను భాగస్వాములను చేసే విధానంలో భాగంగా 20 వ వార్డు పరిధిలో ఏర్పాటు కాబోయే వార్డు కమిటీ జాబితాను మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డికి వైసిపి నాయకులు నర్సారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు సిబ్బంది రక్తదానం



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణం లోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ సిబ్బంది 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం కోర్ట్ సూపరింటెండెంట్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి లో రక్తదానం చేశారు.స్వాతంత్ర్య సమరయోధులు మరియు దేశభక్తి స్ఫూర్తితో కోర్ట్ సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయం అని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

## మేరీ గావ్ మేరీ దరోహర్ పథకంపై గ్రామసభ



**వేముల - సూర్య వాస్తవం :** ప్రతి గ్రామం విశిష్టతను కళలు, పండుగలు, చారిత్రక స్థలాలు గుర్తించి రికార్డ్ చేసి ఒక జాతీయ గ్రామ గెజిట్?ను రూపొందించడమే మేరీ గావ్ మేరీ దరోహర్ ముఖ్య ఉద్దేశమని పంచాయతీ సెక్రెటరీ అనిల్ కుమార్ అన్నారు. గొందిపల్లె గ్రామంలో సోమవారం మేరీగావ్ మేరి దరోహర్ పథకంపై పంచాయతీ సెక్రెటరీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలసి గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ వారసత్వాన్ని సంరక్షించడం మరియు దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు లోకేపల్లి మల్లికార్జునరెడ్డి, లోకపల్లి నాగభూషణ్ రెడ్డి, రమేష్ రెడ్డి, తిరుపాల్, రామ్ సుధాకర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డును ప్రారంభించిన టీడీపీ మండల పరిశీలకుడు

**వేముల - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని స్థానిక చర్చి లైన్‌లో ప్రజల చిరకాల కోరికను నెరవేరుస్తూ నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన రోడ్డును ఆ ప్రాంత ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. వార్డుల్లోని ప్రతి వీధిలోనూ కనీస వసతులు కల్పించే వరకు విశ్రమించబోమని ఆయన హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నామ వేణు కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, తిప్పారెడ్డి, శ్రీ మోహన్ రెడ్డి, యాసీన్, గంగాధర్ రెడ్డి, పిపి చంద్రయుడు, మండల టిడిపి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరగబోయే ఉచిత గుండె, కంటి, దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, డాక్టర్ కోలా



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని సి.ఎస్.ఐ. చర్చి గ్రౌండ్ లో జనవరి 27వ తేదీ మంగళవారం నిర్వహించే ఉచిత గుండె, కంటి ,దంత, వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, మదర్ తెరిసా హ్యూమానిటీ అవార్డు గ్రహీత, కేపీ ఫౌండేషన్, యూ.సి.పి.ఐ.సి చైర్మన్ డాక్టర్ కోలా ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ 27వ తేదీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత శిబిరం కులాలకు, మతాలకు, అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని, గుండె, కంటి, దంత వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. గుండెలో నొప్పి, గుండె దడ, ఆయాసం, కళ్ళు తిరగడం, గుండెలో మంట కలుగుట, చేతిలో బరువుగా ఉండడం, నిద్రలో ఆయాసం వచ్చి లేచి కూర్చోవడం, కాళ్లు వాపులు రావడం, చెమటలు పట్టడం వంటి సమస్యలకు ఉచి తంగా చూడడం జరుగుతుందన్నారు. 27వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటలవరకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉచిత శిబిరంలో జి ఆర్ బి ఎస్, బిపి, ఈసీజీ, టుడి ఏకో, చేయనున్నారు. అలాగే అవసరమైతే ఆపరేషన్ కూడా ఉచితంగా చేయించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాన్ని యుసిపిఐసి యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## జిల్లా కలెక్టర్ ఎస్పీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్సై మహమ్మద్ గౌస్ బాషా



గార్లదిన్నె – సూర్య వాస్తవం: 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం నాడు ఉత్తమ అవార్డు ను అనంతపురం ఇంచార్జ్ కలెక్టర్ విష్ణు చరణ్, అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ చేతుల మీదుగా అవార్డును గార్లదిన్నె ఎస్సై మహమ్మద్ గౌస్ బాషా అందుకున్నారు గార్లదిన్నె పోలీస్ స్టేషన్ సిబ్బంది హర్ష వ్యక్తం చేశారు.

## కలెక్టర్‌చే ఉత్తమ ఉపాధ్యాయరాలుకు ప్రశంసా పత్రం



**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం :** ఉపాధ్యాయ శాఖలో సేవలు అందించినందుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు ప్రొద్దుటూరు పట్టణంలోని లింగారెడ్డి నగర్ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎస్ జవహర్ మున్నీర్ కు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం కడప కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతుల మీదుగా సన్మానించడం జరిగింది. ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలు గా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ బాబు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ల చేతుల మీదుగా అవార్డు తీసుకుని ప్రతిభ చాటిన జవహర్ మున్నీర్ తన సేవలు గుర్తించి తనను సంబంధిత అధికారులు సన్మానం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరు చెరికూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ నిధీ మీనా, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లకు గౌరవప్రదమైన అభినందనలు తెలిపారు.

## ప్రశంసా పత్రం అందుకున్న అర్బన్ సీఐ వేంకటా చలపతి



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని బీటీ కళాశాల మైదానం నందు విధుల పట్ల సమయ స్ఫూర్తి ,అంకిత భావంతో ప్రజలకు విశిష్టమైన సేవలకు గాను జిల్లా కలెక్టర్ నితీష్ కుమార్,జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తో పాటు అదనపు ఎస్పీ వెంకటాద్రి చేతుల మీదగా ప్రశంసా పత్రాన్ని పొందారు రాయచోటి పట్టణ సీఐ వేంకటా చలపతి.ప్రశంసా పత్రం అందుకున్న సీఐ గారికి పలువురు అభినందనలు తెలిపారు. జిల్లా ఉన్నత అధికారుల నుండి ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల తమ పై మరింత బాధ్యత పెరిగిందని వారు పేర్కొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న గుత్తి ఎస్సై సురేష్

**గుత్తి –సూర్య వాస్తవం :** గుత్తి గణతంత్ర దినోత్సవ వేడుక సందర్భంగా అనంతపురం నగరం లోని పోలీస్ పరేడు గ్రౌండ్ లో సోమ వారం అనంతపురం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ విష్ణు చరణ్ చేతుల మీదుగా గుత్తి ఎస్సై గా విధులు నిర్వహిస్తు న్న సురేష్ ప్రశంసా పత్రాన్ని అందు కున్నారు.ఈ సందర్భంగా గుత్తి సీఐ రామారావు,పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు ప్రజలు శుభాకాంక్షలు తెలి పారు.



## పొలాల నుంచి పురస్కారం వరకు..

# రైతు బాంధవుడికి జిల్లా స్థాయి గౌరవం

**- రైతు సంక్షేమ సేవకుడికి జిల్లా స్థాయిలో ఉత్తమ ఏడిఏగా డాక్టర్ ఎం.నాగార్జునసాగర్ ఎంపిక**

**- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదగా సత్కారం**

**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట ఉప విభాగ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం. నాగార్జునసాగర్ జిల్లా స్థాయిలో ఉత్తమ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా ఎంపికై గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి అధికారిక వేడుకల్లో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆయనకు ప్రశంస పత్రం అందజేశారు. రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని నిబద్ధతతో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్లు అధికారులు తెలిపారు. నాయుడుపేట, పెళ్లకూరు, చిత్తమూరు, కోట, వాకాడు మండలాలకు వ్యవసాయ సహాయ సంచాలకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం. నాగార్జునసాగర్ తన పనితనంతో రైతుల మన్ననలు పొందారు. చిన్న రైతు నుంచి పెద్ద రైతు వరకు ప్రతి ఒక్కరికి సమానంగా అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపడంలో ఆయన ముందుంటారని రైతులు చెబుతున్నారు. కార్యాలయాలకే పరిమితం కాకుండా నేరుగా పొలాల్లోకి వెళ్లి పంటల పరిస్థితిని పరిశీలిస్తూ, పంటల వ్యాధులు, దిగుబడి లోపాలు, సాగు విధానాలపై శాస్త్రీయంగా సూచనలు అందించడం ఆయన ప్రత్యేకతగా మారింది. లక్ష ఎకరాలకు పైగా సాగుభూమి ఉన్న నాయుడుపేట సబ్ డివిజన్ లో ఎరువులు, విత్తనాల సరఫరాలో ఎక్కడా జాప్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించారు. అవినీతికి తావులేకుండా పారదర్శక విధానాలతో ఎరువుల పంపిణీ జరగేలా చర్యలు తీసుకోవడంతో ఏ గ్రామంలోనూ "ఎరువులు లేవు – పంట దిగుబడి రాలేదు" అనే పరిస్థితి ఎదురుకాలేదని రైతులు పేర్కొన్నారు. సాగు కాలంలో అవసరమైన ప్రతి ఇన్?పుట్ సమయానికి అందేలా వ్యవసాయ శాఖ సిబ్బందిని సమన్వయం చేస్తూ వ్యవస్థను పటిష్టంగా నడిపించినట్లు అధికారులు తెలిపారు. రైతులు ఎదుర్కొనే చిన్న సమస్యను కూడా పెద్ద సమస్యగా భావిస్తూ వెంటనే




స్పందించడం, ఫోన్ కాల్ ద్వారా అయినా ప్రత్యక్షంగా అయినా రైతులకు అందుబాటులో ఉండడం వల్ల ప్రతి గ్రామంలో ఆయనపై విశ్వాసం పెరిగింది. వ్యవసాయ సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పుడు "మాకు నాగార్జునసాగర్ సార్ రావాలి" అనే స్థాయిలో రైతులు కోరుకునే పరిస్థితి ఏర్పడడం ఆయన సేవలకు నిదర్శనంగా నిలుస్తోంది. తన వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో నిర్వర్తిస్తూ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న డాక్టర్ ఎం. నాగార్జునసాగర్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఏడిఏగా ఎంపికై గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంస పత్రం అందుకోవడం వ్యవసాయ శాఖకు గర్వకారణమని అధికారులు అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న ఆయన సేవలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగాలని రైతులు ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు.

**రైతులు, ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు**

శ్రీపతి చంద్రయ్య (దిగువ చావలి గ్రామం, పెళ్లకూరు మండలం)

డాక్టర్ ఎం. నాగార్జునసాగర్ గారు నిజంగా రైతుల బాధలు అర్థం చేసుకునే అరుదైన వ్యవసాయ అధికారి. పంటల సమస్యలు ఎదురైనప్పుడు కార్యాలయాలకు





తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా పొలాల్లోకి వచ్చి పరిశీలించి పరిష్కారాలు సూచించడమే ఆయన ప్రత్యేకత. చిన్న రైతునైనా, పెద్ద రైతునైనా సమానంగా గౌరవిస్తూ మాట్లాడే ఆయన తీరుతో మాలో ధైర్యం పెరిగింది. జిల్లా స్థాయి ఉత్తమ ఏడిఏగా ఎంపికైన డాక్టర్ నాగార్జునసాగర్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

గోను బాబు (నాయుడుపేట ఏఎంసీ డైరెక్టర్)

డాక్టర్ ఎం. నాగార్జునసాగర్ గారు రైతుల కోసం అహర్నిశలు పనిచేసే నిజమైన రైతు బాంధవుడు. ఎరువులు, విత్తనాలు, పంటల దిగుబడుల విషయంలో ఎక్కడా జాప్యం లేకుండా చూసే విధానం వల్ల మాకు ఎన్నడూ ఇబ్బంది రాలేదు. జిల్లా స్థాయిలో ఉత్తమ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా ఎంపికైన సందర్భంగా ఆయనకు నా తరపున, నాయుడుపేట రైతుల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

"జిల్లా స్థాయి ఉత్తమ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా ఎంపికైన డాక్టర్ ఎం. నాగార్జునసాగర్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు. రైతుల సంక్షేమానికి అంకితభావంతో అందిస్తున్న సేవలు అభినందనీయం. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను."

– దువ్వూరు మధుసూదన్ రెడ్డి, వాకాడు మండల టిటిడి అధ్యక్షులు

# పోలీస్ స్టేషన్‌లోనే అవినీతి ఆట... ఏసీబీ వలలో చిక్కిన ఖాకీ

**- మద్యం మామూళ్ల మాఫియా బట్టబయలు**

**- రూ.లక్ష డిమాండ్... రూ.30 వేల వద్ద హెడ్ కానిస్టేబుల్ అరెస్ట్**

**నాయుడుపేట – సూర్య వాస్తవం :** చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీస్ వ్యవస్థలోనే అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుపోయిందో నాయుడుపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఏసీబీ మెరుపు దాడులు బట్టబయలు చేశాయి. మద్యం షాపుల నుంచి అక్రమ మామూళ్లు వసూలు చేస్తున్న వ్యవహారంలో హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు రూ.30 వేల నగదు స్వీకరిస్తూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు.

**మద్యం వ్యాపారులపై బెదిరింపులు... ఫిర్యాదుతో బయటపడిన స్కామ్**

నాయుడుపేట పట్టణంలోని మద్యం షాపుల యజమానుల నుంచి ప్రతి నెలా భారీగా మామూళ్లు డిమాండ్ చేస్తున్నారని, చెల్లించకపోతే తప్పుడు కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మామూళ్ల వ్యవహారంలో పోలీస్ స్టేషన్ స్థాయిలోనే వ్యవస్థాత్మకంగా అక్రమ వసూళ్లు సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

**పక్కా వ్యూహంతో ఏసీబీ ఉచ్చు**

ఫిర్యాదు ఆధారంగా పక్కా ప్రణాళిక రూపొందించిన ఏసీబీ అధికారులు మద్యం షాపు వద్ద ఉచ్చు బిగించారు.



ఆదివారం సాయంత్రం మామూలుగా రూ.30 వేల నగదు తీసుకుంటున్న సమయంలో హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నగదు స్వీకరిస్తున్న క్షణంలోనే పట్టుబడటంతో నేరానికి సంబంధించిన కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం.

**సీఐ బాబి – హెడ్ కానిస్టేబుల్‌పై కేసులు**

ఈ ఘటనకు సంబంధించి నాయుడుపేట పట్టణ సీఐ బాబి, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజుపై ఏసీబీ కేసు నమోదు చేసింది. నిందితుడిని నాయుడుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**లోపలి లింకులపై ఏసీబీ ఫోకస్**

ఈ మద్యం మామూళ్ల వ్యవహారంలో మరెవరైనా పోలీస్ సిబ్బంది భాగస్వాములా? గతంలో ఎంతకాలంగా అక్రమ వసూళ్లు సాగాయన్న అంశాలపై ఏసీబీ అధికారులు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గత లావాదేవీలకు సంబంధించిన వివరాలు, ఇతర మద్యం షాపుల నుంచి వసూలు చేసిన మొత్తాలపై కూడా విచారణ జరుగుతోంది.

**పట్టణంలో కలకలం**

పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఏసీబీ దాడులు జరగడం నాయుడుపేట పట్టణాన్ని ఒక్కసారిగా కుదిపేసింది. ప్రజల రక్షణ బాధ్యత వహించాల్సిన పోలీసులే అవినీతికి పాల్పడటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అవినీతిపై ఉక్కుపాదం : ఏసీబీ**

అవినీతికి పాల్పడిన వారు ఎంతటి హోదాలో ఉన్నా చట్టం ముందు తప్పించుకోలేరని, ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.

# ఉత్తమ సేవకు...ఉత్తమ పురస్కారం..!

**- ఉత్తమ కానిస్టేబుల్ అవార్డును అందుకున్న తలారి పెద్దయ్యా**

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా సోమవారం నాడు ఉత్తమ కానిస్టేబుల్ అవార్డు ను అనంతపురం ఇంచార్జ్ కలెక్టర్ విష్ణు చరణ్, అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, అనంతపురం జిల్లా 14 బెటాలియన్ అధ్యక్షుడు తలారి



పెద్దయ్య. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ సిబ్బంది పెద్దయ్య చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర సిబ్బందికి ఏ అవసరం వచ్చిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడంలో పెద్దయ్య ముందుంటారు. బెటాలియన్ డెవలప్మెంట్, సిబ్బంది ఫ్యామిలీ వెల్ఫేర్, చనిపోయిన కానిస్టేబుల్ సంబంధించిన డెత్ బెనిఫిట్స్, సిబ్బంది ఫ్యామిలీ లకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో అయన సిద్ధహస్తుడు. ఆయనకు ఈ అవార్డు రావడం పట్ల పలువురు హోర్షం వ్యక్తం చేశారు.

# అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్
# రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి

- అనంతపురం ఇన్‌చార్జి కలెక్టర్ విష్ణు చరణ్ కితాబు
- అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ సేవలకు గుర్తింపుగా మూడు అవార్డులు ప్రదానం



**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** అనంతపురంలో మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేయడం గొప్ప వరమని, ఇక్కడి మదర్స్ మిల్క్ బ్యాంక్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఇంచార్జ్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో సోమవారం ఏర్పాటు చేసిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన మదర్స్ మిల్క్ బ్యాంక్ స్టాల్‌కు జిల్లా స్థాయి గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ విష్ణు చరణ్ స్టాల్ సందర్శించారు. మిల్క్ బ్యాంక్ ఉద్దేశం, పాల సేకరణ గురించి ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఇది వరకే రెండు మిల్క్ బ్యాంక్‌లు ఉండగా.. తాజాగా ఇటీవల మరో మిల్క్ బ్యాంక్ ను అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. పాల సేకరణ ఎలా సేకరిస్తారో తెలుసుకున్నారు. సేకరించిన పాలను ఎలా ప్రాసెస్ చేస్తారో డాక్టర్ హేమలత వివరించారు. దీంతో కలెక్టర్ మదర్స్ మిల్క్ బ్యాంక్ పనితీరు అద్భుతమని ప్రశంసించారు. మదర్స్ మిల్క్ బ్యాంక్ కు జిల్లా స్థాయిలో బెస్ట్ అవార్డు ప్రకటించారు. మదర్స్ మిల్క్ బ్యాంక్ నిర్వాహకురాలు డాక్టర్ గుజ్జల హేమలతకు బెస్ట్ అచీవ్మెంట్ అవార్డు ప్రకటించారు. మిల్క్ బ్యాంక్ లో పని చేసే సునీతకు బెస్ట్ స్టాఫ్ నర్స్ అవార్డు అందించారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి, రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ స్ఫూర్తిగా నిలవాలని కోరుకున్నారు. మదర్స్ మిల్క్ బ్యాంక్ నిర్వహణకు సంబంధించి మూడు అవార్డులు సొంతం చేసుకున్న ఆర్.ఎం.ఓ హేమలత, మిల్క్ బ్యాంక్ సిబ్బందిని అనంతపురం జీజీహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి బహినందించారు. కార్య క్రమంలో మదర్స్ మిల్క్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ భాస్కర్ నాయక్, స్టాఫ్ నర్సులు మానస, బోయ సుకన్య, హైమావతి, రమాదేవి, లత, కౌన్సిలర్ రాధ, ల్యాబ్ టెక్నీషియన్లు కామేష్, గీత, ఎం.ఎన్.ఓలు వేంకటసాయి కుమార్, నారాయణ, వలంటీర్లు మండోజీ షాహిద్ ఖాన్, ఓంనాథ్, సెక్యూరిటీ గార్డులు శోభా, నాగరాజు, శ్రీకాంత్, పల్లవి పాల్గొన్నారు.



## దేశభక్తి నినాదాలతో మార్మోగిన సుధీర్ సాయి ఇండేన్ గోడౌన్ ప్రాంగణం

**కనేకల్ - సూర్య వాస్తవం :** సుధీర్ సాయి ఇండేన్ ఎల్పీజీ గోడౌన్, కనేకల్?లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారము ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలతో రూపొందిన రాజ్యాంగం దేశ ప్రజలకు దిశానిర్దేశం చేస్తోందని తెలిపారు. దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీ అహింసా మార్గంలో చేసిన పోరాటం, సామాజిక సమానత్వ స్థాపనలో డా. బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ప్రతి భారతీయుడు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ తన బాధ్యతలను నిర్వర్తించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని వారు స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత రాజ్యాంగ విలువలను అవగాహన చేసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే సంస్థ కార్యకలాపాలు ప్రజలకు నిరంతరం నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ వేడుకల్లో సంస్థ సిబ్బంది, ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమం అనంతరం స్వీట్లు పంపిణీ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మహేష్, చంద్ర, ఆదినారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథం

- పరిరక్షించుకోవడం అందరి బాధ్యత
- భారతీయులందరికీ శ్రీరామరక్ష
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** భారత రాజ్యాంగం పవిత్రమైన గ్రంథమని,భారతీయులందరికీ శ్రీరామరక్ష అని,దీనిని పరిరక్షించు కోవడం ప్రతి భారతీయుని బాధ్యత అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి అన్నారు. 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచం లోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అన్నారు.ఇందులో 12 షెడ్యూళ్లు,25 విభాగాలు,448 అధికరణలు ఉంటాయన్నారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం,లౌకికవాదం, సామ్యవాదం, గణతంత్ర రాజ్యం అనబడే నాలుగు స్తంభాల మీద, న్యాయం,స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనబడే నాలుగు దూలాల మీద నిర్మించబడింది అన్నారు. స్వర్గీయ అంబేడ్కర డ్రా ఫ్టింగ్ కమిటీ ఛైర్మన్ గా, కేఎం మున్షి,సాదుల్లా,అల్లాడి కృష్ణ స్వామి అయ్యర్, గోపాలస్వామి అయ్యంగార్, ఖైతాన్,మిట్టర్ సభ్యులుగా,బెనిగల్ నర్సింగ రావు రాప్ డ్రాఫ్టింగ్ కమిటీ సలహాదారుడుగా, ఎస్ఎన్ ముఖర్జీ డ్రాఫ్ట్ మెన్ గా ఏర్పాటు అయిన డ్రాఫ్టింగ్ కమిటీ భారత రాజ్యాంగాన్ని రచించింది అన్నారు. 2 సంవత్సరాల 11 నెలల18 రోజులు పట్టింది.పాకిస్తాన్లో రాజ్యాంగం ఇప్పటికి ఆరుసార్లు రద్దయిందని, అలాగే శ్రీలంకలో మూడుసార్లు,నేపాల్ లో మూడుసార్లు రద్దు అయిందని అన్నారు.దేశాల సగటు రాజ్యాంగం కాలపరిమితి 15 సంవత్సరాలు కాగా భారతదేశంలో 77 సంవత్సరాలు అయినా భారత రాజ్యాంగం అమలులో ఉండడం ప్రతి భారతీయునికి గర్వకారణం అన్నారు.దీనిని రక్షించుకోవడం ప్రతి భారత పౌరుని బాధ్యత అన్నారు.అందుకోసం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి భారతీయుడు భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం అంకితం,పునరంకితం కావాలని తులసి రెడ్డి ఉద్బోధించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, , తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు, బ్యాంకు శ్రీనివాసులు, నామా వినయ్, తదితరులు పాల్గొన్నారు.

**మురళీమోహన్‌కు, రాజేంద్రప్రసాద్‌కు అభినందనలు**

2026 రిపబ్లిక్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ సినీ నటులు మురళీమోహన్ కు, రాజేంద్రప్రసాద్ కు పద్మశ్రీ అవార్డులు ప్రదానం చేయడం హర్ష నీయమని తులసి రెడ్డి అన్నారు.

## విద్యార్థుల్లో దేశభక్తి భావన పెంపొందించాలి



**వేముల- సూర్య వాస్తవం :** విద్యార్థుల్లో దేశ భక్తి భావన కలిగివుండాలాని వేముల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దక్షిణా మూర్తి పేరకున్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ దక్షిణా మూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది అని,ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కళాశాల ల్లో చదువుతున్న విద్యార్థుల్లో దేశభక్తి, కర్తవ్యబోధ పెంపొందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు విద్యార్థుల జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయని తెలిపారు. యువత దేశాభివృద్ధిలో భాగ స్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మస్తానయ్య, సుబ్బారాయుడు, బాలయ్య, భాస్కర, అంజాద్ అలీ, సతీకుమార్ రెడ్డి, పుల్లయ్య, బాబీ, కిరణ్మయి, భోదనేతర సిబ్బంది, స్వర్ణలత, విజయ్‌లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడలతో పాటు చదువులలో కూడా రాణించాలి

- హాకీ ప్లేయర్స్‌కు బహుమతులు ప్రదానం



**పులివెందుల- సూర్య వాస్తవం :** విద్యార్థులు క్రీడలతో పాటు చదవాలలో కూడా రాణించాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి, ధర్మవరం బ్రహ్మయ్య ధర్మవరపు బ్రహ్మయ్య, ఆంధ్రప్రభ నియోజకవర్గ ఇన్చార్జ్ మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి లు, యూట్యూబర్ పులివెందుల హరి, ఆంధ్రప్రభ టౌన్ రిపోర్టర్ చక్కని హరి కుమార్, మురళిలు అన్నారు. సోమవారం వైయస్సార్ క్రీడా మైదానంలోని టర్ఫ్ గ్రౌండ్లో 77వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని హాకీ క్రీడాకారులకు ఫ్రెండ్లీ మ్యాచ్ లను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మధుసూదన్ రెడ్డి,చంద్రమోహన్ రెడ్డి, యూట్యూబర్ హరి, చిక్కనిహరి, మురళి లు ముందుగా క్రీడాకారులను పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిపబ్లిక్ డే రోజున హాకీ క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. క్రీడల వలన ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం హాకీ పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు తోగుట్ల మధుసూదన్ రెడ్డి, బ్రహ్మయ్యలు సమకూర్చిన బహుమతులను మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,మురళి, యూట్యూబర్ హరి, చక్కని హరికుమార్ ల చేతులు మీదుగా బహుమతులను అందజేశారు.

## నేడు వైసీపీ శింగణమల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేద్దాం

- వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వై నారాయణ రెడ్డి



**గార్లదిన్నె - సూర్య వాస్తవం:** శింగన మల నియోజకవర్గం అన్ని మండలాల నుంచి వైసిపి నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వై నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. గార్లదిన్నె మండల కేంద్రంలోని టి- కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న శింగణమల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో, శింగణమల నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు మరియు సర్పంచులు అందరూ కూడా తమ బాధ్యతగా భావించి, సమన్వయంతో కదిలి, ఈ సమావేశానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వైయస్సార్సీపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వై నారాయణ రెడ్డి గారు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా ఏకతాటిపైకి రావాలని ఆయన కోరారు.

## కోనేపల్లి ప్రాథమిక పాఠశాలకు విరాళాల వెల్లువ



**పామిడి రూరల్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పామిడి మండలంలోని కోనేపల్లి ప్రాథమిక పాఠశాలలో 77 వ రిపబ్లిక్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా పాఠశాలకి అవసరం అయిన వాటర్ ప్లాంట్ ,బాటిల్స్ ట్యాంక్ ను వితరణ గ్రామస్తులు చేశారు. వీరినీ ఉపాధ్యాయులు , గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రహారీ గోడ కి దాదాపు 1లక్ష రూపాయలు కూడా మిగతా ప్రజలు ప్రకటించారు. రామాంజీ నాయక్ సిమెంట్ , హెమ్ 10వేలు, రామాంజీ టీచర్ 10వేలు, సర్పంచ్ వెంకటేశ్ నాయక్ 10 వేలు మరియు సచివాలయం సిబ్బంది 5వేలు, ఓబులయ్య 10వేలు, రమేష్ నాయక్ 10వేలు, రామకృష్ణ 5వేలు, అంజనీ శేషు 5 వేలు, పురందర 10వేలు ఇవ్వగ ప్రసన్న కుమార్ గేట్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసుదేవు, రామాంజనేయులు, అంగన్వాడి టీచర్ మద్దిలేటమ్మ, సర్పంచ్ వెంకటేశ్ నాయక్, కూటమి నాయకులు రామాంజి నాయక్, రమేష్ నాయక్, ఓబులయ్య, రామకృష్ణ, రామాంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగ ణంలో ఎంపీపీ వీరనారాయణ రెడ్డి , ఎంపీడీవో రామ చంద్రారెడ్డి జెండా ఎగురవేసి జాతీయ గీతం ఆలపించారు, సొసైటీ బ్యాంక్ ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి త్రివర్ణ జెండా ఎగురవేసి జెండా వందనం నిర్వహించి స్వాతంత్ర యోధుల గురించి ప్రసంగించారు, స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్సై శివప్రసాద్ త్రివర్ణ జెండా ఎగురవేసి సెల్యూట్ చేసి మన దేశానికి సేవలు చేసిన స్వాతంత్ర యోధుల గురించి మాట్లాడారు. మిఠాయి పంపిణీ చేశారు. రేకులకుంట పంచాయతీ సచివాలయం నందు జాతీయ జెండాను తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాణాల మల్లికార్జున్ రెడ్డి, అలాగే బ్రైట్ మైండ్ స్కూల్లో కరెస్పాండెంట్ శిల్ప జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు విద్యలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు. అలాగే ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లు మన జాతీయ జెండాను ఎగరవేశారు.

**గార్లదిన్నెలో...**మండల పరిధిలోని కల్లూరు ఆర్ఎస్ జిల్లా పరిషత్



ఉన్నత పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయులను స్మరించుకుంటూ , చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నాయి. రిపబ్లిక్ డే సందర్భంగా చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**పామిడిలో....**




పామిడి శ్రీ చైతన్య స్కూల్ నందు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయులను స్మరించు కుంటూ చిన్నారుల వేషధారణలు, ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య పాఠశాల పాఠశాల సీఈవో సంతోష్ రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం భారత దేశానికి బ్రిటిష్ వారి నుండి విముక్తి కలిగిన రోజు, ఆగస్టు15 – 1947.గణతంత్ర్యం దేశానికి రాజ్యాంగం ఏర్పడిన రోజు జనవరి 26 –1950 ఫ్రీడం వచ్చిన తరువాత, మన నాయకులు భారతదేశం ఎలా నడిపించాలి, పరిపాలించాలి, ఎలాంటి అంశాలు ఉండాలి, చట్టం ఏమిటి, శిక్షలు ఏమిటి అనేవి ఆలోచించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి ఇచ్చారని మనకి ఆ రాజ్యాంగం ఏర్పడిన రోజు గణతంత్ర దినోత్సవం గా జరుపుకుంటామని చిన్నారులకు తెలియజేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన మరియు స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు చేస్తూ నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

**మదరసా–ఇ– ఖాసిం ఉలూమ్ లో**

దేశ రాజ్యాంగ స్ఫూర్తిని చాటుతూ పామిడి నేషనల్ హైవే ప్రక్కన ఉన్న మదరసాలో ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మిన్నంటాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జామియా మసీద్ ముత్తవల్లి బికే రహీం విచ్చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు బి కే రహీం మాట్లాడుతూ ఎందరో మేధావులు, త్యాగధనుల నిరంతర కృషి ఫలితంగా మన దేశానికి అత్యున్నతమైన రాజ్యాంగం లభించిందని కొనియాడారు. 1950 జనవరి 26న అమలులోకి వచ్చిన ఈ రాజ్యాంగం భారత్?ను ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిపిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలోమదరసా–ఇ– ఖాసిం ఉలూమ్ లో కార్యదర్శి సి. జాకీర్ హుస్సేన్ మాదర్సా కమిటీ సభ్యులు మరియు ముఫ్తీల హిదాయతుల్లా, రషీద్ హఫీజ్ హిదయతుల్లా, సరీఫ్, సాదిక్, నిజాం, ఫెరోజ్, మన్సూర్, జెలాన్, తదితరులు పాల్గొన్నారు.






**అనంతపురం అశోక్ నగర్ ఫస్ట్ క్రాస్‌లో..**

అనంతపురం అశోక్ నగర్ ఫస్ట్ క్రాస్ లోని మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో గణతంత్ర వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశభక్తిని చాటే కార్యక్రమాలను విద్యా ర్థులు అత్యంత ఉత్సాహంగా ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. రాజ్యాంగ విలువలు, పౌరుల కర్తవ్యాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ జి. భాస్కర్ రెడ్డి హాజరై విద్యార్థులకు శు భాకాంక్షలు తెలియజేస్తూ, దేశాభివృద్ధి యువత శక్తిపై ఆధారపడి ఉందని, దీని దృష్టిలో పెట్టుకొని ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.

**అనంతపురం బాలసదనంలో...**



అనంతపురం బుడ్డప్ప నగర్‌లోని ఐసీడీఎస్ అనుబంధం బాలసదనంలో సూపరిం టెండెంట్ ఖాజీ రఫీమున్నీసా ఆధ్వ ర్యంలో గణతంత్ర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మువ్వన్నెల జెండాను సూపరింటెండెంట్ రఫీమున్నీసా ఆవిష్కరించి, సెల్యూట్ చేశారు. అంతకు ముందు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గణతంత్ర విశిష్టతను వివరించారు. అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అకౌంటెంట్ ఫాతిమా, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎస్.ఆర్.కే ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో..**



అనంతపురంలోని వికాస్ నగరలో గల ఎస్.ఆర్.కే హై స్కూల్ లో 77వ గణతంత్ర దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని పాఠశాల డైరెక్టర్ రమేష్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం అందరూ గౌరవప్రదంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆ క్షణం దేశభక్తి భావాలను నింపింది. విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, ప్రసంగాలు, నాటికలు ప్రదర్శిస్తూ భారతదేశ వైవిధ్యంలోని ఐక్యతను ప్రతిబింబిందారు. కరస్పాండెంట్ సునీత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పౌరుల కర్తవ్యం వంటి అంశాలపై విద్యార్థులకు చక్కగా వివరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ రూపకల్పనకు చేసిన కృషిని గుర్తుచేశారు. పాఠశాల ప్రాంగణం త్రివర్ణ పతాకాలతో, అలంకరణలతో అందంగా అలకంరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యత గల పౌరులుగా ఎదగాలని సందేశం ఇచ్చారు. చివరగా చిన్నారులు వివిధ వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు.

**లక్కిరెడ్డిపల్లిలో...** 77వ గణతంత్ర వేడుకలు లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి




గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యంత శక్తివంతమైనదని భారత దేశంలోని ప్రతి పౌరునికి సమానమైన హక్కులను అవకాశాలను రాజ్యాంగం కల్పిస్తుందని ప్రతి పౌరుడు అత్యున్నత స్థాయికి చేరుకోవడానికి రాజ్యాంగం సమాన అవకాశం కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు మార్కెట్ కమిటీ కార్యదర్శి సరస్వతి ,మార్కెట్ కమిటీ సిబ్బంది మరియు అహ్మద్ అలీ రవీంద్ర లక్కిరెడ్డిపల్లి తెలుగు యువత మండల అధ్యక్షులు కొలిమి పకీరయ్య మల్లి తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేటలో..**



భీమవరం గ్రామంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం గ్రామ సర్పంచ్ నెలవల అమృతమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు విజయ్‌కుమార్, ఉప సర్పంచ్, మండల ఏఎంసీ డైరెక్టర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోను బాబు పాల్గొని జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మల్లు గోపాల్, సచివాల సిబ్బంది, గ్రామస్తులు కోటపూరి వెంకటసుబ్బయ్య, వేణుంబక రమణారెడ్డి, ఎడమల్లి శ్రీనివాసులు, దొర్నాడి పరంధామయ్య, నెలవల రవి తదితరులు పాల్గొన్నారు. వేడుకలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ముగిశాయి.

**పత్తికొండ టౌన్‌లో...** పత్తికొండ మహమ్మదీయ మస్జిద్ లో మస్జిద్



ప్రెసిడెంట్ సబ్దీన్ నూర్ బాషా ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మస్జిద్ ముఫ్తీ హాబీబ్ ఉల్ల ఖాన్ పతాక ఆవిష్కరణ చేసి ప్రంగాంచారు. గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యత ఏమిటంటే, 1950 జనవరి 26న భారతదేశ రాజ్యాంగం అమల్లోకి వచ్చి, దేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజును గుర్తు చేసుకోవడం, ఇది దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రజాస్వామ్య విలువలను, సైనిక పటిమను, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతుంది. ఈ రోజున భారతీయులు తమ రాజ్యాంగం ద్వారా తమ ప్రభుత్వాలను ఎన్నుకునే అధికారాన్ని పొందిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని జరుపుకుంటారు. సంక్షిప్తంగా, గణతంత్ర దినోత్సవం భారతదేశం తన సొంత నియమాలతో, ప్రజాస్వామ్య విలువలతో ఒక స్వతంత్ర దేశంగా ఎదగడానికి గుర్తుగా జరుపుకునే ఒక ముఖ్యమైన జాతీయ పండుగ.అని తెలియచేసారు.ఇలాగే ప్రతి మస్జిద్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి అని రాజ్యాంగంలో ముస్లింలకు ఉండే హక్కులను తెలుసుకోవాలి అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో మహమ్మదీయ మస్జిద్ ప్రెసిడెంట్ సాబ్దీన్ నూర్ బాషా,ముత్తవల్లి శాబ్దీన్ మహబూబ్ బాషా,శాబ్దిన్ జాకీర్ హుస్సేన్, మౌజన్ కొల్కర్ హుస్సేన్సా , కోల్కర్ సద్దం, డింగ్రి సద్దం,అమన్,గౌస్,మదిరెస పిల్లలు పాల్గొన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**అనంతపురం 14వ బేటాలియన్‌లో...**

అనంతపురం నగరంలోని జంతాలూరు గ్రామంలోని 14వ బేటా లియన్‌లో 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బేటాలియన్ ప్రభుకుమార్ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు.అనంతరం అయన మాట్లాడుతూ భారత దేశానికి రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు మాత్రమే కాదుని, దేశం సర్వసత్తాక, సార్వభౌమత్వ దేశంగా మారిన రోజని అన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత పౌరులుగా ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా, ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.



## మదనపల్లి డిఎస్పీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ

అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం



దేశ రాజ్యాంగ స్ఫూర్తిని చాటుతూ అన్నమయ్య జిల్లా మదనపల్లి డిఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మిన్నంటాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి జాతీయ పతాకాన్ని ఆవిష్క రించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎందరో మేధావులు, త్యాగధనుల నిరంతర కృషి ఫలితంగా మన దేశానికి అత్యున్నత మైన రాజ్యాంగం లభించిందని కొనియాడారు. 1950 జనవరి 26న అమలులోకి వచ్చిన ఈ రాజ్యాంగం భారత్?ను ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిపిందని గుర్తుచేశారు. పోలీస్ సిబ్బంది రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ, ప్రజల హక్కులను కాపాడుతూ నిబద్ధతతో, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, సామాన్య ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) యం. వెంకటాద్రి , మదనపల్లి డిఎస్పీ యస్. మహేంద్ర ఏఆర్ డిఎస్పీ శ్రీ డి. ఏడుకొండల రెడ్డి, పలువురు పోలీసు అధికారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మార్కెట్ యార్డ్‌లో జెండా ఎగరవేసిన మార్కెట్ కమిటీ చైర్మన్





వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి వైస్ చైర్మన్ మట్లీ శ్రీనివాసులు నాయుడు కమిటీ డైరెక్టర్లు రఘునాధ శ్రీనివాసులు వంశీ రామ తులసి ఉదయగిరి మస్తాన్ నాయక్ స్టాఫ్ సభ్యులు కిషోర్ మురళి మొదలగు వారు పాల్గొన్నారు

### చిన్నమండలం వీఆర్వో ఆధ్వర్యంలో



రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండలం మండాడి గ్రామం సచివాలయంలో సోమవారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు వీఆర్వో ఆధ్వర్యంలో మహిళా పోలీస్ ముస్తబ్ సిరా, వెల్ఫేర్ అశ్విని వెటర్నరీ అసిస్టెంట్ జయశ్రీ సిబ్బంది కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడికి విచ్చేసిన పలువురికి స్వీట్స్ అందజేశారు.

### కడప జిల్లా వీరబల్లి మండలంలో

కడప జిల్లా వీరబల్లి మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్సై సుస్మిత జెండా ఎగురవేసి జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

## - అవార్డులను పంపిణీ చేసిన కలెక్టర్ శ్యాం ప్రసాద్

**శ్రీ సత్యసాయిబ్యూరో - సూర్య వాస్తవం :** గణతంత్ర దినోత్సవం శ్రీ సత్య సాయి జిల్లాలో సోమవారం ఘనంగా జరిగింది గత నాలుగు ఐదు రోజుల ముందు నుంచి జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు సోమవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎస్పీ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ విధి నిర్వహణలో నైపుణ్యత సాధించడంతో వారికి ఉత్తమ అధికారి అవార్డులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నాట్యాలు వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.













# హుసేనాపురం జడ్పీ హైస్కూల్లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ప్యాపిలి -సూర్య వాస్తవం :** మండల పరిధిలోని హుసేనాపురం జడ్పీ స్కూల్ నందు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయులను స్మరించుకుంటూ చిన్నారుల వేషధారణలు, చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ అన్వర్ భాష,సీనియర్ల సహకారంతో ,94- 95 బ్యాచ్ ఓల్డ్ ఓల్డ్ స్టూడెంట్స్, మాట్లాడుతూ స్వాతంత్ర్యం భారత దేశానికి బ్రిటిష్ వారి నుండి విముక్తి కలిగిన రోజు, ఆగస్టు15 - 1947.గణతంత్ర్యం దేశానికి రాజ్యాంగం ఏర్పడిన రోజు జనవరి 26 -1950 ఫ్రీడం వచ్చిన తరువాత, మన నాయకులు ఇండియాని ఎలా నడిపించాలి, పరిపాలించాలి, ఎలాంటి అంశాలు ఉండాలి, చట్టం ఏమిటి, శిక్షలు ఏమిటి అనేవి ఆలోచించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి ఇచ్చారని మనకి ఆ రాజ్యాంగం ఏర్పడిన రోజు రిపబ్లిక్ డేన్నారు.రిపబ్లిక్ డే సందర్భంగా చిన్నారులకు బహుమతులను 94-95 ఓల్డ్ స్టూడెంట్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.







# ఐ. ఏం. ఏం బాషా ఉత్తమ సేవలకు దక్కిన ప్రశంస

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** అనంతపురం పట్టణానికి చెందిన సామాజిక వేత్త టీడీపీ మైనారిటీ నాయకుడు ఐ. ఏం. ఏం మహబూబ్ బాషా కు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఇంచార్జి కలెక్టర్ విష్ణు చరణ్, ఎస్పీ పి. జగదీష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందింది. సమాజానికి మెరుగైన సేవలందించడంలో అయన ప్రతిభకు ఈ గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా జిల్లా వాసులు, నాయకులు, అధికారులు, బంధు మిత్రులు బాషా ను అభినందించారు.



# సీఐ వలి బాషకు అవార్డు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** సీఐ వలి బాషు కు జిల్లా స్థాయి అవార్డు దక్కింది. విధి నిర్వహణలో అయన అందించిన సేవలకు గుర్తింపుగా అనంతపురం జిల్లా కలెక్టర్ విష్ణు చరణ్, జిల్లా ఎస్పీ పి. జగదీష్ చేతుల మీదుగా అయన అవార్డు అందుకున్నారు.

# సూర్య సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు





**రాయదుర్గం-**సూర్య వాస్తవం: రాయదుర్గం సూర్య సేవ సమితి సభ్యులు తాయి రాజశేఖర్, జ.మల్లికార్జున, డాక్టర్ షబ్బీర్, కో ఆప్షన్ మెంబర్ కె.వి శ్రీనివాసులు, మల్లారెడ్డి, దబ్బడి శేఖర్, హిందీ పండిట్ సురేష్, గోల్డ్ ఇస్మాయిల్, భాస్కర్ రెడ్డి, డీకే, మంజునాథ్, అస్లాం, అన్నపూర్ణ సిల్క్ మహేష్, ఆర్ పి అనిల్, సత్తి, రాయల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మురళి, బి ఎన్ నరసింహ, కిరాణా సురేష్, చెక్కా శ్రీనివాసులు, లాయర్ హరి, కేడిమి శ్రీనివాసులు, బత్తల తిప్పేస్వామి, ఎర్రి స్వామి, పసుపులేటి బాబు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువల గణతంత్ర దినోత్సవ వేడుకలు

### బీటీ కళాశాల మైదానంలో....





స్థానిక మదనపల్లి బెంగళూరు రోడ్డు లోని బీటీ కళాశాల మైదానంలో సోమవారం అత్యంత వేడుకగా కన్నుల పండుగగా జరిగిన 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు.ఈ వేడుకలలో కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ నిశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి, డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి మరియు పీలేరు ఆర్డీవో శ్రీనివాస్ వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, వివిధ పాఠశాలలు కళాశాలల విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు తదితరులు వేడుకలలో పాల్గొన్నారు.ఉదయం 9.00గం.లకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జాతీయ జెండా పతాకావిష్కరణ గావించి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు.అనంతరం జిల్లా ఎస్పీ ఎస్పీ జిల్లా ఎస్పీ ధీరజ్ తో కలిసి మైదానంలో పెరేడ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పెరేడ్ మైదానంలో వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి.ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టి అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ , జిల్లా మేజిస్ట్రేట్ నిశాంత్ కుమార్ ప్రజలకు సందేశమిచ్చారు. పలువురు జిల్లా అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



# ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు





**వేంపల్లె -సూర్య వాస్తవం :** తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,వేంపల్లి నందు 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి మరియు ముఖ్య అతిధులు పాఠశాల కమిటీ చైర్మన్  బుజ్జి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు అందరూ కలిసి భరతమాత చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం ప్రధానోపాధ్యాయులు, ముఖ్య అతిధులు కలిసి జెండా వందనం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని కూలంకషంగా విద్యార్థులకు వివరించి దేశ ప్రగతి కోసం,ఐక్యత కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులందరికీ మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




**అమ్మ ఆద్మీ పార్టీ ...** వేంపల్లిలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కడప జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదా పీర్, అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు బందెల రామాంజనేయులు, ఉపాధ్యక్షులు పుల్లయ్య, భారతదేశం గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. గణతంత్రదినోత్సవవేడుకనూ వేంపల్లి నాలుగు రోడ్ల కూడలి లో జాతీయ జెండా నూ ఎగురవేసి  ఘనంగా గౌరవ వందనం తెలియజేశారు, ఈకార్యక్రమంలో  ఆప్ మండల సభ్యులు పీరు బాషా, ఎస్ ఎం డి  గౌస్, తదితరులు పాలొగొన్నారు.



**వేంపల్లె వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో** 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా, దేశభక్తితో జరిపారు. కళాశాల లో జాతీయ పతకాన్ని ప్రిన్సిపాల్ ఎస్. నాగేంద్ర ఎగురవేసి, తన ప్రసంగంలో జాతీయ సమైక్యత మరియు ఐక్యత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. క్రీడలు మరియు విద్యా రంగాలలో విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు, సమగ్ర విద్య పట్ల కళాశాల నిబద్ధతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర , ప్రసాద్ ,విద్యార్థులు మరియు సిబ్బంది మహేష్, రమేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ గీతంతో వేడుకలు ముగిశాయి, జాతీయ గౌరవం మరియు విలువల పట్ల కళాశాల అంకితభావాన్ని పునరుద్ఘాటించారు.







**కదిరి నారాయణ పాఠశాలలో...** పట్టణంలోని నారా యణ పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఘనంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి సంబరాలను జరుపుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు పఠాన్  జి సర్ఫరాజ్ ఖాన్ మువన్నెల జెండానుఆవిష్కరించి శ్వేత కపోతాన్ని ఎగురవేశారు , శ్వేత క పోతం గాలిలోకి ఎగరగా ,,, పావురాన్ని ఉద్దేశించి స్వేచ్ఛ జీవులుగా జీవిస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఏవో ,జక్రియ, పాఠశాల ప్రోగ్రాం ఇంచార్జ్ రెడ్డి హరిత, ఈ చాంప్స్ నియామత్ , ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు , మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు







**హుసేనాపురం జడ్పీ హైస్కూలో....**మండల పరిధిలోని హుసేనాపురం జడ్పీ స్కూల్ నందు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయులను స్మరించుకుంటూ  చిన్నారుల వేషధారణలు, చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నాయి. రిపబ్లిక్ డే సందర్భంగా చిన్నారులకు బహుమతులను 94-95 ఓల్డ్ స్టూడెంట్ చేతుల మీదుగా  అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




**కామన్ మ్యాన్ కార్పొరేట్ పాఠశాల....**భారతదేశం గణతంత్రంగా అవతరించిన మహత్తర దినమైన 77వ గణతంత్ర దినోత్సవాన్ని కామన్ మ్యాన్ కార్పొరేట్ పాఠశాల, సింహాద్రిపురం లో అత్యంత ఘనంగా, దేశభక్తి భావాలతో నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలు విద్యార్థుల్లో దేశాభిమానం, రాజ్యాంగ విలువలు, జాతీయ సమైక్యత పట్ల అవగాహన పెంపొందించేలా సాగాయి.

మొత్తంగా ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయత, బాధ్యతాయుత పౌరసత్వ విలువలను నాటేలా విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఇలాంటి కార్యక్రమాలు విద్యతో పాటు దేశసేవ పట్ల యువతను స్ఫూర్తిదాయకంగా తీర్చిదిద్దుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.





**కృష్ణవేణి స్కూల్లో** పామిడి మండల పరిధిలోని కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయులను స్మరించుకుంటూ చిన్నారుల వేషధారణలు, చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



**జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్**
వేంపల్లె 77వ గణతంత్ర దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

**కదిరి సెయింట్ థామస్ పాఠశాలలో ...**పట్టణంలోని సెయింట్ థామస్ పాఠశాలలో




గణతంత్ర వేడుకలు సంబరాలు ఘనంగా నిర్వహించారు, విద్యార్థి నీ ,విద్యార్థుల సాంస్కృతిక,  ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సుదర్శన్, ఏవో సాంబశివరెడ్డి, పి ఈ టి జగదీష్, ఉపాధ్యాయినీ ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



**శ్రీ చైతన్య హై స్కూల్‌లో ....**వేంపల్లె శ్రీ చైతన్య హై స్కూల్‌లో భారతదేశ 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు బోధనేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. చివరగా జాతీయ గీతంతో కార్యక్రమం ఘనంగా ముగిసింది.



**కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ...** విద్యార్థులు దేశభక్తి పాటలు, ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ సింహారెడ్డి నారాయణరెడ్డి రవి సుబ్బయ్య వాసవి సుగుణ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొని వేడుక ను విజయవంతం చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తి నినాదాలు, జాతీయ గీతంతో ఉత్సాహభరితంగా ముగిశాయి.







**రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి**
రాయదుర్గం  ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి బళ్ళారి బిజెపి నాయకులు ప్రజలు  పాల్గొన్నారు.





**ఎంపీపీ పవిత్ర వన్నూరు స్వామి, జడ్పిటిసి హసీనాబాను**
రాయదుర్గం
భారత రాజ్యాంగ 77వ గణతంత్ర దినోత్సవం  జ్యోతిరావు పూలే పాఠశాల నందు  ఎంపీపీ పవిత్ర వన్నూర్ స్వామి, జడ్పిటిసి హసీనాబాను, ప్రిన్సిపల్ షాహిదా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పవిత్ర వన్నూరు స్వామి మాట్లాడుతూ.. 77వ గణతంత్ర దినోత్సవం విద్యార్థుల మధ్య జరుపుకోవడం  గర్వకారణమన్నారు. విద్యార్థుల ఆటల పోటీలను నైపుణ్యం ప్రదర్శన విజేతులకు  11100 రూపాయలు సొంత నిధులు బహుమతి అందించామన్నారు.  ఈ కార్యక్రమంలో ఎంపీపీ లింగప్ప రహంతుల్లా ఎంపిటిసి రుద్రమ్మ ఎర్రిస్వామి గొల్ల సురేష్ ఉపాధ్యాయులు సూర్యనారాయణ కాంతారావు గిరిజాపతి గంగాధర హనుమంతరాయుడు గంగాధర్ గౌడ్ సిద్ధతరులు పాల్గొన్నారు.




## లోక్‌భవన్‌లో ఎట్ హోమ్

### - పాల్గొన్న సీఎం, డిప్యూటీ సీఎం, నారా లోకేష్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**కడప /అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:** విజయవాడ లోక్‌భవన్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్?కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సవిత తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు

- దేశభక్తిని చాటుకునే జాతీయ, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన పండగ
- 1930లో కాంగ్రెస్ ప్రకటించిన 'పూర్ణ స్వరాజ్' జ్ఞాపకార్థం
- ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులుమన్సూర్ అలీఖాన్, అమీర్ భాష



**రాయచోటి– సూర్య వాస్తవం:** ఎన్నో త్యాగమూర్తుల పోరాటాల ఫలం, 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే గణతంత్ర దినోత్సవమని డిసిసి అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం 77 వ గణతంత్ర దినోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథి గా హాజరై స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేసి గౌరవ సెల్యూట్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇది కేవలం సెలవు దినం కాదు, ప్రజాస్వామ్య, సార్వభౌమ దేశంగా అవతరిం చిన, గర్వించదగిన రోజు అని ఆయన అన్నారు. అమర వీరుల త్యాగాలను, రాజ్యాంగ విలువలను స్మరించు కుంటూ, దేశభక్తిని చాటుకునే జాతీయ, చారిత్రక ప్రాముఖ్య త కలిగిన పండగ అన్నారు. 1930లో కాంగ్రెస్ ప్రకటించిన 'పూర్ణ స్వరాజ్' జ్ఞాపకార్థం, జనవరి 26, 1950న రాజ్యాం గం అమలులోకి తెచ్చారని ఆయన తెలిపారు. త్యాగ మూర్తులకు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన స్వా తంత్ర్య సమర యోధులను స్మరించుకుంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నివాళులు అర్పించా రు. అనంతరం డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ భాషా మాట్లా డుతూ ఈరోజు వ్యక్తిగత స్వేచ్ఛసమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను పున రుద్ఘాటిస్తుందని, అమరవీరుల త్యాగాల వల్ల మనం అనుభవిస్తున్న స్వేచ్ఛను గుర్తుచేసుకుంటూ,దేశ సార్వ భౌమా ధికారాన్ని కాపాడు కోవాలని ఈ రోజు తెలియ జేస్తుందని ఆయన చెప్పారు. యువత దేశభక్తితో క్రమశిక్షణ తో దేశ అభివృద్ధికి తోర్పడాల ని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపా ధ్యక్షుడు దర్బార్, కిసాన్ సెల్ అధ్యక్షుడు సురేంద్ర, సెక్రెటరీ ఖాదర్ ఖాన్, సోషల్ మీడియా చైర్మెన్ నరేష్ ,జిల్లా మైనార్టీ సెల్ సెక్రెటరీ యహియా బాష, రాజంపేట పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, టౌన్ సెక్రెటరీ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కులస్తులను బీసీ -ఏలో చేర్చాలి

### - ముదిరాజ్ కుల పేద్దలు



**వేంపల్లె –సూర్య వాస్తవం:** వేంపల్లె గవిమల్లేశ్వర స్వామి ఆవరణంలో నేడు ముదిరాజ్ కులస్తుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ముదిరాజ్ కుల పెద్దలు మాట్లాడుతూ రాష్టంలో ముదిరాజులు 20 లక్షలు పైబడి ఉంటే ప్రభుత్వాలు తక్కువ లెక్కలు చెబుతున్నాయని మండిపడ్డారు.రాష్టంలో కులగణన చేపట్టి ముదిరాజ్ ల సంఖ్య తెల్చాలని వారూ దిమాండ్ చేసారు. ముదిరాజ్ లు ఆర్థికంగాను రాజకీయంగాను సామజికంగాను చాలా వెనుక పడ్డారని తక్షణమే ముదిరాజులను బిసి. డి నుండి బిసి ఏ లేకి మార్చాలని వారు డిమాండ్ చేశారు. ముదిరాజులు ఆర్థికంగా రాజకీయంగా సామజికంగా ఎదిగేందుకు మండలంలోని ముది రాజుల ఐక్యతకు కొరకు ప్రతి ముదిరాజ్ బిడ్డ తమవంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముదిరాజ్ కులస్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

## ఎందరో త్యాగధనుల కృషి, ఫలితమే

# నేటి గణతంత్ర దినోత్సవ వేడుకలు

### - ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభకాంక్షలు తెలిపిన అన్నమయ్య జిల్లా ఏంపిపి సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లె – సూర్య వాస్తవం**

ఎందరో త్యాగధనుల కృషి,ఫలితమే నేడు గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటు ఉన్నామని అన్నమయ్య జిల్లా ఎంపీపి ల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.మండల ప్ర?జ?లంద?రికీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి గ?ణ?తంత్ర దినోత్స?వ శుభాకాంక్షలు తెలిపారు.సోమవారం 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురేసి త్రివర్ణ పతాకానికీ గౌరవ వందనం చేశారు.అనంతరం ఉర్దూ ఉన్నత పాఠశాల, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం,లక్కిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ సచివాలయ కార్యాలయంల లో జాతీయ జెండాను ఎగుర వేసి విద్యార్థుల సమావేశంలో ప్రసంగించి, విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్ రెడ్డి




మాట్లాడుతూ రాజ్యాంగ రూపకర్త డా.బి.అర్. అంబేద్కర్ అని,రాజ్యాంగ స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలను సామా జిక, ఆర్థికపరంగా చైతన్య వంతులను చేయ?డానికి అంబేద్కర్ రాజ్యాంగాన్ని భారత దేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు చాటి చెప్పారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెయ్య,ఏం.ఈ.వో.లు వెంకటసుబ్బయ్య, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, సర్పంచ్ సజ్జల అహల్య, ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపిటిసి సభ్యులు దస్తగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ అధ్యక్షుడిగా చెన్నుపల్లి సుబ్బారెడ్డి

**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా రెండవసారి నియామకం చేసిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించిన చెన్నుపల్లె సుబ్బారెడ్డి. రెండవసారి మండల బి.మఠం మండల తెదేపా అధ్యక్షునిగా నియామకమైన సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించిన బి.మఠం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అలాగే జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు కాణాల మల్లికార్జున్రెడ్డి. తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కార్యకర్తలు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ కు జిల్లా అధ్యక్షులకు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రయాణికుల భద్రతను కాపాడాలి

### - ట్రాక్ మెషిన్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా 77వ రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు

### - చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ ఎస్ ఎండి గౌస్ బాషా



**బెంగళూరు – సూర్య వాస్తవం:** బెంగళూరు పట్టణంలోని స్థానిక యశ్వంత్‌పూర్ సౌత్ వెస్టర్న్ రైల్వేలోని ట్రాక్ మెషిన్ యూనిట్ ( భారతదేశం 77వ రిపబ్లిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో అధికారులు, యూనియన్ ప్రతినిధులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జాతీయ గర్వాన్ని ప్రతిబింబిస్తూ రైల్వే సిబ్బంది సేవ, భద్రత పట్ల అంకితభావాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు మీనా ఆర్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్; పరశురామ్ వి కడోల్కర్, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ మల్లారద్దెప్ప, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హాజరయ్యారు. సౌత్ వెస్టర్న్ రైల్వే మజదూర్ యూనియన్ ట్రాక్ మిషన్ యూనిట్ బ్రాంచ్ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ ఎస్ ఎండి గౌస్ బాషా మాట్లాడుతూ... భారతదేశం 77 సంవత్సరాల రిపబ్లిక్ స్థాయిని పూర్తి చేసినప్పటికీ, ఆహారం, నీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు ఇంకా వెనుకబడిన వర్గాలకు చేరలేదని ఆయన ఉద్ఘాటించారు. రైల్వే సిబ్బందిగా మనమంతా అంకితభావం, నిబద్ధత, సమయపాలన, క్రమశిక్షణ, భక్తితో పనిచేయాలని, ముఖ్యంగా ట్రాక్ భద్రతను నిర్ధారించి, ప్రతిరోజూ భారతీయ రైల్వేలలో ప్రయాణించే సుమారు 3 కోట్ల మంది ప్రయాణికుల భద్రతను కాపాడాలని పిలుపునిచ్చారు.ట్రాక్ మెషిన్ యూనిట్, సౌత్ వెస్టర్న్ రైల్వే ప్రాంతంలో ట్రాక్ మౌలిక సదుపాయాల నిర్వహణ మరియు మెకానైజేషన్?లో కీలక పాత్ర పోషిస్తోంది. ఇది రైలు సేవల విశ్వసనీయత, భద్రతకు గణనీయంగా దోహదపడుతోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్, జూనియర్ ఇంజినీర్ మురళీ మోహన్, బీఈసీ మెంబర్ శ్రీనివాస, యూనిట్‌లోని సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాయచోటి ప్రజా గొంతుక మూగబోయింది

### - కామ్రేడ్ రఫీకి నివాళులర్పించిన టిడిపి జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు




**రాయచోటి–సూర్య వాస్తవం:** పట్టణంలోని అలీమాబాద్ వీధి వాస్తవ్యులు కామ్రేడ్ రఫీ(టైలర్) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు సోమవారం కామ్రేడ్ స్వగృహానికి వెళ్లి రఫీ భౌతికకాయా నికి ఘన నివాళులర్పించారు. మరణవార్తతో పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను కలిసి, వారిని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఒక ధీర గొంతుక కామ్రేడ్ రఫీ మరణించడం సమాజానికి తీరని లోటు. అవినీతి, సామాజిక సమస్యలపై, స్థానిక సమస్యలపై చివరి శ్వాస వరకు పట్టణంలో జరిగే సభలు సమావేశాలలో ప్రసంగించే, ప్రశ్నించే తత్వం ఉన్నవారు కోల్పోవడం సమాజప్రగతికి,ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని ఆయన అన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాడేవారు ఎల్లప్పుడూ అన్యాయం, అవినీతికి వ్యతిరేకంగా నిలబడతారు, రాచవీడు టైలర్స్ అసోసియేషన్‌కు, సమాజానికి వెన్నెముక వంటివారని చెప్పారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టే వారి ప్రస్థానం ముగియడం, సమాజంపై ప్రభావం చూపుతుందని,ఆ గొంతుక లేకపోవడం, సమస్యలపై నిరసనలకు కూడా అడ్డుకట్ట వేసినట్లు అవుతుందని. ప్రజా గొంతుక మూగబోవడం అనేది ఒక వ్యక్తిని కోల్పోవడం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో నిరసన స్వరం క్షీణించడం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్ బాబు తో పాటు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొ న్నారు. కామ్రేడ్ రఫీ మరణం వారిత కుటుంబానికి తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు.

## బండ్ల గణేష్ పాదయాత్రకు సంఘీభావం

### - జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, డిసిఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్

**కర్నూల్ – సూర్య వాస్తవం:** జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ డిసిఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ కలిశారు. బండ్ల గణేష్ 8వ రోజు పాదయాత్ర కర్నూలో ప్రారంభించారు. బండ్ల గణేష్ కి చంద్రబాబు నాయుడు పై ఉన్న అభిమానంతో చంద్రబాబు నాయుడు జైలు లో ఉన్నప్పుడు వారు త్వరగా సురక్షితంగా బయటికి రావాలని ఆ ఏడుకొండల వాడిని ప్రార్థించడం జరిగింది. చంద్రబాబు నాయుడుపై పెట్టిన కేసు కొట్టి వేయడంతో ఆ మొక్కును చెల్లించుకోవడానికి హైదరాబాద్ నుంచి తిరుపతికి పాదయాత్ర చేస్తున్న బండ్ల గణేష్‌కి తెలుగుదేశం పార్టీ నాయకుల తరఫున అభినందనలు తెలియజేస్తూ వారికి సన్మానించి పుష్పగుచ్చాము అందించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వారికి సంఘీభావం తెలియజేశారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )